మే - 2023

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


గౌరవ సంపాదకులు :

**కె. సామ్యేల్ రాజేంద్ర**

సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**



**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. 350/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లోపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890


## విషయసూచిక



| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్నత్వనేహు | కొడవటికంటి | 03 |
| 'ది బెస్ట్' | ఇమ్మానియేలు రాజేంద్ర | 06 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 07 |
| లూదియ | హన్నాకృప డెస్క్ | 09 |
| రక్షణ | సాక్ష్యం | 11 |
| అభివృద్ధి | హన్నాకృప డెస్క్ | 13 |
| కలిగిన వాటితో... | హన్నాకృప డెస్క్ | 14 |
| చీకటి శక్తుల .... | సాక్ష్యం | 15 |
| మార్పు | చిన్నపిల్లల పేజి | 17 |
| కృపాదానం | కొడవటికంటి | 19 |
| దేవున్ని వెదకండి | హన్నాకృప డెస్క్ | 21 |
| దేవుడు - సిరి | హన్నాకృప డెస్క్ | 22 |
| లోకం తీరు | ఇమ్మానియేలు రాజేంద్ర | 23 |
| పరిశుద్ధగ్రంథపరిశోధనా పట్టిక-10 | | 24 |





సీరియల్ నంబరు

# సంపాదకీయం.....



హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

పత్రికను ఆదరిస్తున్న మీకు ప్రభువు నామమున కృతజ్ఞతలు తెలియజేయుచున్నాము. ముఖ్యముగా తెలియ జేయునది ఏమనగా, హన్నాకృప మాసపత్రికను ఇంటర్నెట్‌లో ఎడిషన్‌ను ప్రారంభించిన సంగతి పాఠకులకు తెలియజేస్తున్నాము. ఈ వెబ్‌సైట్ www.onlinetelugubible.net ద్వారా మీరు పత్రికను చదువుకొనవచ్చును. మీరు స్మార్ట్ ఫోన్ వాడుతున్నట్లయి పత్రికను మీరు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విదేశాలలో ఉన్న మీ బంధువులకు, స్నేహితులకు తెలియజేయండి. ఇకపోతే, ఎన్నడూ లేనంత విపరీతమైన ఎండలు ఒక్కపక్క, ఆకాశాన్నంటిన నిత్యావసర వస్తువుల ధరలు ఇంకోపక్క జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. అక్కడక్కడా సంభవిస్తున్న భూకంపములు దేవుని రాకడ అతి సమీపముగా ఉన్నదని మనకు గుర్తు చేస్తున్నాయి. కాబట్టి మనం చాలా అలర్ట్‌గా ఉండాలి. మనం మన కుటుంబం రక్షింపబడాలంటే దేవుని సన్నిధిలో ఎక్కువగా గడుపుతుండాలి. ఎందుకంటే ప్రస్తుత ప్రపంచంలో ప్రతి ఒక్కరూ చాలా బిజీ అయిపోయారు. టి.వి., ఇంటర్నెట్, సెల్‌ఫోన్ మనుష్యులను దేవునికి దూరం చేస్తున్నాయి. దేవుని వాక్యం వింటున్నారే కాని, విన్న వాక్యాన్ని ధ్యానించే సమయం లేకుండా ఉంటున్నారు. కాబట్టి సాతాను యొక్క తంత్రాలను మనం నిశితంగా గమనించుకోవాలి. సాతాను చాలా తెలివిగా, మనుష్యులను దేవుని నుండి దూరం చేయడానికి చాలా ఆయుధాలను సిద్ధం చేసుకొని ఉంది. కాబట్టి ప్రతి ఒక్కరూ వీలైనంత సమయం దేవుని సన్నిధిలో గడపటం ద్వారా సాతాను నుండి రక్షింప బడగలము.

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరు చున్నాను. మీరు ఫోన్‌పే ద్వారా చందా పంపాలనుకుంటే పత్రికలో 5వ పేజీలో ముద్రించబడిన క్యూఆర్ కోడుని ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసి పంపవచ్చును. మీరు ఫోన్‌పే ద్వారా చందా కట్టినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

సీరియల్

# జ ఫ్న త్ప నే హు

(యోసేపు జీవితచరిత్ర)

- కొడవటికంటి

“బిడ్డని పోగొట్టుకొని ఏడ్చే తల్లి రోదన నీ చెవిని పడినప్పుడు నీ కళ్ళలో నుండి నీళ్ళు ఎందుకొస్తాయి? ఈ అనుభూతిని వర్ణించగలవా? అది అనుభవించే హృదయానికి పరిమితం. దేవునితో మనం మాట్లాడినా, ఆయన మనతో మాట్లాడినా – అది వ్యక్తిగతమైన అనుభవమే గాని, మనలో మనం పంచుకొనేది కాదు. అయినా అది ఆశించే యదార్ధ హృదయులందరికి వాగాత్తమే!” అన్నాడు యోసేపు.

“అందరికీ అది వాగాత్తమే అని ఎలా చెప్పగలవు?” అడిగాడు వియాన్.

“మొదట మా తండ్రిగారి తాత, వారి పితరులు అందరూ యూఫ్రటీసు నది అవతల ‘ఊరు’ అనే పట్టణంలో నివసించేవారట. అది చాలా పెద్ద పట్టణం. ఇప్పటి ఐగుప్తు నాగరికతను మించిన నాగరికత అయిందట. వారు విగ్రహారాధికులే కాని, అబ్రహాము అనే మా తాత మనసులో దైవకార్యం మొదలైంది. తన తండ్రియైన తెరహు విగ్రహాలు తయారుచేసి వ్యాపారం చేస్తుంటే. అబ్రాహాముగారు హృదయవేదన పొందేవాడు. దేవుని గూర్చిన జ్ఞానము కొరకు తపించేవాడు. మానసిక క్షోభలో పడిపోయాడు. ఆయన కున్న ఆస్థికాని, అందమైన భార్యకాని, బంధుమిత్రులు కాని ఆయన తపన తీర్చలేకపోయారు. ప్రతిరోజూ ఆ ఆలోచనలతోనే లోకానికి పిచ్చివానిగా కనిపించారు.

దేవుణ్ణి మానవుడు తయారు చేయటం ఏమిటి? దేవుణ్ణి మనం తయారుచేసి మనం అమ్ముకోవటం... ఆ కొనుక్కున్న వాళ్ళు ఆ దేవుణ్ణి గుడి అని పేరు పెట్టిన ఆ గదిలో బంధించి, నగలతో అలంకరించి, వస్త్రాలు తొడిగించి, అవి దొంగిలింపబడకుండా మనమే దేవునికి కాపలా కాయటమేమిటి? తనను తాను కాపాడుకోలేని దేవుణ్ణి మనం ఎందుకు పూజించాలి? మనం చేసే విగ్రహాలు, మన పూజా విధానం దేవుణ్ణి సంతోషపరిస్తే –అతను చాలా బలహీనుడైన దేవుడై ఉండాలి.

ఇంత గొప్ప సృష్టికర్త ఎవరో తెలియపరచడంలేదు. కాని తెలుసుకోవాలి. ఆయన సాక్ష్యాత్కార్యములు – ఆయన హస్తకృత్యములు అయిన సూర్యచంద్ర నక్షత్రాల రూపంలో ఉన్నాయి. అసలు ఆయన సర్వశక్తిగలవాడై మానవుని మేధస్సుకు అందనివాడై యుండాలి. చచ్చిపోయిన తర్వాత భూమిలో కుళ్ళిపోయే మెదడుకి దేవుడు అర్ధం కాదు. దేవుడు చేసిన మెదడు తనను చేసిన వానిని గ్రహించగలదా? కుండ కుమ్మరివాని గురించి ప్రసంగం చెయ్యగలదా? కాదు, కాదు, దేవుని వెదకే హృదయం ఈ లోకంలో ఎవరు పెంచుకుంటారో దేవుని గురించిన ధ్యానం ఏ హృదయంలో స్థిర నివాసం ఏర్పరచుకుంటుందో, వారు ఈ కనబడే లోకం యొక్క అస్థిరతని, అశాశ్వితాన్ని అర్ధం చేసుకొని అసహ్యించుకుంటారు.

అబ్రాహాముగారికి అందమైన ఊరు పట్టణం అసహ్యంగా కనిపించింది. ఎవరో అక్కడ నుండి దూరంగా వెళ్ళిపొమ్మన్నట్లుగా అనిపించింది. ఈ స్థితి ఇంకొకరికి చెప్పుకునేది కాదు. చెప్పినా అవతలి వారికి అర్ధం కాదు.

అంత పెద్ద మహానగరంలో అబ్రాహాము ఒంటరిగా అయిపోయాడు. ఆ పట్టణంలోని జాతరలు, చంద్రదేవుని ఆలయం, సూర్యదేవుని ఆలయం, అక్కడి వాళ్ళని చూస్తేనే – మా అబ్రాహాము తాత హృదయం రోదించేది. సూర్యుణ్ణి ఎందుకు పూజిస్తున్నారు? ఆ సూర్యుణ్ణి చేసి మానవులకు బహుమానంగా ఇచ్చిన సృష్టికర్తకు కోపం రాదా? మానవులు ఎన్ని తప్పులు చేస్తున్నా ప్రేమిస్తూనే ఉంటాడా? తన హృదయానికి నెమ్మది ఎప్పుడు ఎక్కడ నుండి వస్తుంది?

ఈ విధమైన అలసిపోయిన మనస్సుతో పండుకున్న

అబ్రాహాము తాతకి దేవుని స్వరం వినిపించింది. 'నీవు లేచి నీ దేశము నుండియు, నీ బంధువుల యొద్దనుండియు, నీ తండ్రి ఇంటినుండి బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము. నిన్ను గొప్ప చేయుదును. నీవు ఆశీర్వాదముగా నుందువు. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెను. నిన్ను దూషించువారిని శపించెదను. భూమి యొక్క సమస్త జీవరాసులు నీయందు ఆశీర్వదింపబడును' అని చెప్పాడు. అబ్రాహాము తాత నిజంగా విన్నాడంట. అంతే! ఊరు పట్టణం నుండి భార్యతో బయలుదేరి వచ్చేశాడు.

చాలా సంవత్సరాలు గుడారాలలో నివసించి చనిపోయాడు. ఆయన కుమారుడు మా తాత ఇస్సాకు. ఆయన మనవడు మా తండ్రి యాకోబు. అందరూ దేశదిమ్మరుల్లాగా గుడారాల్లోనే నివసిస్తున్నారు. మాకు చాలా ఆస్థి ఉంది. బానిసలు ఉన్నారు. లెక్కించలేనన్ని పశువులు, పనివారు ఉన్నారు. కాని జీవించేది మాత్రం గుడారాలలోనే! అది దేవుని ఆజ్ఞ.

మా తండ్రి కొంతకాలం క్రితం షెకెములో ఇళ్ళు కట్టించి, గొప్ప వ్యాపారాలు చేసి, చాలా డబ్బు సంపాదించాడు. పేరు ప్రతిష్టలు సంపాదించాడు. కాని పది సంవత్సరాల్లోనే ఆయన సంతోషం, నెమ్మది పోయి కుటుంబ మంతా చెల్లాచెదరైపోయింది. అదంతా ఓ పెద్ద కథ! అంతా చెప్తే చెవులారా విన్నట్లుగా ఉంటుంది వియాన్! వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు అన్న నమ్మిక నాలో పూర్తిగా ఉంది. మా తాత మహారాజు, మాతండ్రి కూడా మహారాజే. నేను రాజకుమారులందరి కంటే అబ్బురంగా పెంచబడిన వాడినే. కాని ఇంత త్వరగా, గుక్క తిప్పుకోలేనంత వేగంగా జరిగిన ఈ కొద్దిరోజుల చరిత్ర – భవిష్యత్తులో ఏ విధంగా ఉంటుందో!" అన్నాడు యోసేపు.

వియాన్ యోసేపు ముఖంలోకి క్రొత్తగా చూస్తున్నాడు. యోసేపు ముఖం చూసేకొద్ది వియాన్ ముఖం గంభీరంగా మారిపోతుంది. ముందు కొంచెం సరదాగా అనుకున్నా యోసేపుకు వియాన్ కళ్ళలో ఏదో తీక్షణత కనిపించగానే ఒకరకమైన భయం వేసింది.

"వియాన్! వియాన్!" అని చిన్నగా పిలిచాడు.

వియాన్ తెప్పరిల్లి యోసేపు వైపు మామూలుగా చూస్తూ "రాత్రి నువ్వు అలసిపోయి తొందరగా నిద్రపోయావు. కాని నేను అలా బానిసలను గమనిస్తూ వెళ్తున్నాను. మన గుంపులో దాదాపు వందమంది మనుష్యులు, అరవై పశువులు ఉన్నాయి కదా! ఈ ఇసుక ప్రయాణంలో మన యజమానికి పదిమంది బానిసలు, నాతో ఆరుగురు జీతగాళ్ళు ఉన్నారు. ఎనిమిది ఒంటెల వ్యాపార సరుకు ఉంది. అందులో గుగ్గిలం ముఖ్యం. బానిసలలో – బహు వృద్ధుడు, ప్రియమైనవాడు, నమ్మకస్తుడు ఉన్నాడు. అతని పేరు 'షేతారు'. అతనికి వాస్తుశాస్త్రము, ముఖాను గణితము, హస్త సాముద్రికము తెలుసు. రాత్రి నేను అతనికి దగ్గరాగా వెళ్తున్నప్పుడు అతను నాతో మాట్లాడాడు. అదంతా నీ గురించే. నీ భవిష్యత్తు బాగుందని, నిన్ను ఎప్పుడూ ఏదో శక్తి కాపాడుతుందని, నీ జీవితమంతా ఎత్తుపల్లాలతో ఉండి, అనేకులకు ఆశ్చర్యకరంగా ఉంటుందని చాలా చెప్పాడు" అని ముగించాడు. "వియాన్! అదిగో ఆ కనబడేది ఏ ఊరు?" అడిగాడు యోసేపు. యోసేపుకు దప్పిక అవుతుంది. భోజన సమ యంలో మంచినీళ్ళు త్రాగటానికి వీలవుతుంది. నీరు చాలా జాగ్రత్తగా వాడాలి. నీరు అయిపోతే ప్రాణం పోయినట్లే.

" యుల్లైతై అక్కడ నుండి పదిహేను మైళ్ళు ఉంటుంది. అంటే రేపు పగలు రెండవ జాముకి అక్కడికి చేరుకుంటాం. ఒకవేళ యజమానులు అందరూ ఒక్కటై రాత్రి ప్రయాణం పెట్టుకుంటే ఈ రాత్రి నాల్గవజాము మధ్యలో అక్కడకు చేరుకుంటాము. అక్కడకు చేరుకుంటే ఇక నీటి కరువు తీరినట్లే" అన్నాడు వియాన్.

"ఇంక పదిహేను మైళ్ళ దూరంలో మంచినీళ్ళు దొరుకుతాయంటే ఇప్పుడు తిత్తులను ఖాళీచేసుకునేంత నీరు మనం త్రాగవచ్చు కదా!" అన్నాడు యోసేపు.

"ఎడారి ప్రయాణంలో ఎవరూ అలా చేయరు. చివరికి నీరు ఎదురుగా ఉన్నా నీటి తిత్తులను ఖాళీ చేయరు. ఎందుకంటే మనకు చాలా చేరువలోనే నీరు ఉన్నట్లు

4కనిపించేవి నిజానికి నీరు కాకపోవచ్చు. ఈ ప్రాంతంలోనే ఎండమావులు ఉండేది" అన్నాడు వియాన్.

గుంపును నడుపుతున్నవారు ఆపుతారేమోనని చూశారు కాని ఆగలేదు. అలాగే అలసి పోయినట్లుగానే భారంగా నడుస్తున్నారు బానిసలు. ఒంటెల నోటి నుండి వచ్చే ఒక రకమైన మూలుగు, అడుగులకు లయబద్ధంగా పడతుంది కాని ప్రయాణం – సాగుతున్న రబ్బరులాగా, ఏ క్షణాన సాగటం ఆగిపోతుందో తెలియనట్లుగా ఉంది.

యుల్లైతై వద్ద గుంపు ఆగింది. కాని ఎక్కువసేపు కాదు. భోజనం చేసిన తర్వాత కొంచెం సేపు మాత్రం బానిసలు చెట్ల నీడలో విశ్రాంతి తీసుకున్నారు. ఇక్కడ మహాసముద్రం కనిపించటం లేదు. ఈ భూమి అంతా ఎర్రని ఇసుక మాత్రమే అన్నట్లుగా ఎటు చూసిన ఎర్రటి ఇసుకే. యుల్లైతై నుండి బయలుదేరిన గుంపు ఈ రాత్రంతా ప్రయాణం చేస్తుందని వియాన్ చెప్పాడు. ఒంటె మీద అంబారి – కూర్చోటానికే గాని పండుకోవటానికి వీలు కాదు. ఈ రాత్రంతా మేలుకొనే ఉండాలి. అది అవసరం కూడా. ఐగుప్తు పొలిమేరల్లో ప్రవేశించటానికి ఇంకా ముప్పై మైళ్ళు వెళ్ళాలి. రాత్రి ప్రయాణం కాబట్టి చల్లగా, నిదానంగా వెళ్ళవచ్చు. రేపు ఉదయాన్నే మంచినీళ్ళు కడుపు నిండా త్రాగగలమని ఒంటెలకు తెలుసు. ఈ దారిలో ఈ జీవులు ఇప్పటికి ఎన్ని సంవత్సరాలుగా తిరుగుతున్నాయో.

"ఇన్ని రోజులూ ఎర్రని ఇసుక దిబ్బలు, ఎర్రని మనుష్యులను చూశావు కదా! ఇక రేపటి నుండి అంతా నలుపే చూస్తావు. పురాతన కాలం నుండి ఐగుప్తు అసలు పేరు 'కామ్' అంటే నలుపు అని అర్థం. నల్లరేగడి నేలలు ప్రపంచంలో చాలా చోట్ల ఉన్నాయి. కాని నైలునది ప్రవహించే ప్రదేశం మాత్రం నివాసయోగ్యం. భూమి మీద ఈ ప్రాంతమంతా ఇసుక ఎడారి కదా! కానీ నైలునది కూషుదేశం నుండి నాలుగు వేల అయిదు వందల మైళ్ళు ప్రయాణం చేసి మధ్యధరా సముద్రంలో కలుస్తుంది. మామూలుగా శరదృతువులో ప్రవహిస్తుంది. హేమంత ఋతువులో అంచుల మటుకు ప్రవహిస్తుంది. ఇది ప్రవహించినంత దూరం దీనికి వేరే ఉపనదులు, చీలికలు లేవు. ముగింపు ప్రయాణంలో ఏడు చీలికలుగా అయి సముద్రంలో కలుస్తుంది. ఇది ప్రవహించే భూమి అంతా ఇసుక ఎడారి అయినందువల్ల చాలా నీరు ఇసుకలోనే ఇంకిపోతుంది. కొంత నీరు ఆవిరైపోతుంది. ప్రజలందరూ ఈ నీళ్ళే త్రాగుతారు. పొలాలన్నిటికీ ఈ నీరే అయినప్పటికీ ఎక్కువ నీరు సముద్రంలోకి వెళ్ళిపోతుంది.

దీని జన్మస్థలం నుండి అనాదిగా తీసుకొచ్చి వదిలి వేయబడిన నల్లని ఒండ్రుమట్టి ఈ ప్రాంతాన్ని సారవంతం చేసింది. కామ్‌లో ఎక్కడ త్రవ్వినా, దున్నినా అంతా నల్లని మట్టే. అంతేకాదు కూషుదేశం నుండి తీసుకురాబడిన బానిసలు యజమానుల కంటే సంఖ్యలో ఎక్కువైనందువల్ల ఈ భూమి నిండా కూడా నల్లముఖాలే" అని ముగించాడు వియాన్. **(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra




# 'ది బెస్ట్...'



మంచి వాటిని ఎంచుకోవడం మనుష్యుల సహజ నైజం. ప్రతి దాంట్లో ది బెస్ట్ కావాలనుకుంటారు. తినే తిండి, వేసుకొనే బట్టలు, ఉండే ఇల్లు, చదువు, పెళ్ళి ఇలా మనం ఏది ఎంచుకోవాల్సి వచ్చినా మంచిది ఎన్నుకుంటామే తప్ప ఏదో ఒకటిలే అనుకోరు.'ది బెస్ట్' ఎంచుకొనేటప్పుడు ఏ మాత్రం రాజీపడని వాళ్ళు కూడా ఉంటారు. ఎంత ఖర్చు అయినా పర్వాలేదు, ఎంత టైం పట్టినా పర్వాలేదు అన్నట్లు 'ది బెస్ట్' కోరుకుంటారు. చాలామంది ఒక మంచి భర్త, భార్య కోసం ఎంతకాలమైనా ఎదురు చూసేవాళ్ళుంటారు. మంచి చదువు చదవడానికి ఎంత డబ్బైనా ఖర్చు చేసేవాళ్ళుంటారు. పేదవాళ్ళు, గొప్పవాళ్ళు అన్న తేడా లేకుండా వాళ్ళకున్నదాంట్లో మంచి వాటినే కోరుకుంటారు. అంటే ఉత్తమమైన వాటిని కోరుకుంటారు. అయితే దేవుని విషయంలో 'ది బెస్ట్' అనేది ఏంటో ఎవరికీ తెలీదు. చర్చికి వెళ్ళడం, బైబిలు చదవటం, ప్రార్థన చేసుకోవడం 'ది బెస్ట్' అనుకుంటారు. కొంతమంది చర్చికి వెళ్ళడమే గొప్ప విషయం అనుకుంటారు. కొంతమంది ప్రార్థనకి మించినది లేదు అనుకుంటారు. కొంతమంది బైబిలు జ్ఞానం ఉంటే చాలు అనుకుంటారు. సువార్త ప్రకటించడమే దేవుడు కోరు కుంటాడు కాబట్టి అదే 'ది బెస్ట్' అనుకుంటారు. మన ఆలోచన ప్రకారం, మనకి ఏది ఇష్టం అనిపిస్తే, అదే దేవుని ఇష్టమని భావించి 'ది బెస్ట్' అనుకుంటాము. అయితే యేసుప్రభువు దృష్టిలో 'ది బెస్ట్' ఏంటనేది ఆయనే స్వయంగా చెప్పాడు. 'మార్తా, మార్తా, నీవనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందరపడుచున్నావు గాని అవసరమైనది ఒక్కటే, మరియ ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను, అది ఆమె యొద్ద నుండి తీసివేయబడదు' (లూకా 10:41,42) అని మనుష్యులకు అవసరమైనది, ఉత్తమమైనది ఒక్కటే అది 'దేవుని సన్నిధి' అని చెప్పాడు. మార్త ఏమీ టీ.వి. చూస్తూనో, ఫోన్‌లో గేమ్స్ ఆడుకుంటూనో మరియను పంపమని అడగలేదు. యేసుప్రభువుకి, ఆయన శిష్యులకు పరిచర్య చేస్తూ మరియని సహాయపడటానికి పంపమని యేసుని అడిగింది. నిజానికైతే యేసుప్రభువే మరియతో చెప్పాలి 'అక్క చాలా కష్టపడుతుంది, వెళ్ళి అక్కకి సహాయం చెయ్యి' అని. అయితే ఆయన అలా చెప్పకపోగా 'మరియ రాదు, నీ పని నువ్వే చేసుకో' అని చెప్పినట్లుగా 'మరియ ఉత్తమమైనది ఏర్పరచుకుంది, అది ఆమె యొద్ద నుండి తీసివేయబడదు' అని చెప్తే పాపం మార్త పరిస్థితి ఏంటి? చాలామంది అంతే, దేవుని పని చేస్తున్నామని సంబరపడిపోతారు, ఒళ్ళు హూనం చేసుకొని మరీ చర్చిలో పనులు చేస్తారు, సువార్త సభల కోసం కష్టపడతారు, పాస్టర్లు, సువార్తికులు వస్తే వాళ్ళకి చికెన్ బిరియాని చేయడానికి చాలా కష్టపడతారు కానీ వాళ్ళు దేవునిలో ఎదగాలని కోరుకోరు, దేవుని వాక్యము మీద శ్రద్ధ పెట్టరు. మరియ యేసు పాదాల దగ్గర కూర్చుని ఆయన మాటలు వింటూ ఈ లోకాన్నే మర్చిపోయింది. దేవుని సన్నిధిలో గడపడమనే 'ది బెస్ట్' మరియ ఎన్నుకుంది. దేవుని సన్నిధిలో ఉండటమంటే మనం చేయాల్సిన పనులన్నీ మానేసి ఏ చర్చిలోనో, ఇంట్లోనో ఒక మూల కూర్చొని బైబిలు చదువుతూనో, ప్రార్థన చేసుకుంటూ ఉండటమో కాదు గానీ, మనం ఏ పని చేస్తున్నా, ఎక్కడికి వెళ్తున్నా మన హృదయంలో, మన ఆలోచనలలో దేవుని గూర్చి తలపోసుకుంటూ ఉండటమే దేవుని సన్నిధిలో గడపటం. ఈ లోకంలో మనకోసం మనం ఏర్పరచుకొనేవి మనకు 'ది బెస్ట్' కాకపోవచ్చు కానీ, మరియలా యేసుసన్నిధిని కోరుకుంటే అంతకంటే **'ది బెస్ట్'** ఇంకేదీ ఉండదు. మరి మీకు.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

సీరియల్



# నా చిత్తానుసారుడు

– కొడవటికంటి

(దావీదు జీవిత చరిత్ర)

గొల్యాతు తలను డేరా మధ్య దూలముకు ఆనించి దావీదు క్రింద కూర్చోన్నాడు. షేలహు ప్రక్కనే కూర్చున్నాడు. కొంచెం విశ్రాంతి అనిపించింది. షేలహు ఇచ్చిన మంచి నీరు బేత్లెహేము బావి నుండి తెచ్చినవి. కడుపు నిండా త్రాగాడు. షేలహు వైపు చూచి చిన్నగా నవ్వి "రాజుగారు" అన్నాడు దావీదు. "ఆయన యెబూసు వెళ్ళారు" అన్నాడు షేలహు. "ఆయన అక్కడికి ఎందుకు వెళ్ళారు. గిబియాకి కదా వెళ్ళవలసింది?" అన్నాడు దావీదు. "ఆ ఎత్తైన కొండల మీద నుండి చూస్తే ఫిలిష్తీయులు పడిపోవటం కనబడు తుందని" చెప్పాడు షేలహు."అయితే మనం బయలు దేరదామా?" అన్నాడు దావీదు. గొల్యాతు ఆయుధాలు ఆ డేరాలోనే ఉంచి ఒక సైనికునికి వాటిని అప్పగించి దావీదు, షేలహు బయలుదేరారు.

యెబూసుకు ప్రయాణం ఎంత దూరమైనా భారంలేదు కాని, ఆ కోటకి చేరటానికి చాలా ఎత్తైన కొండలు ఎక్కాలి, సరైన దారిలేదు. ఈ రోజు ఫిలిష్తీయుని తల తన కుడిచేత్తో పట్టుకుని ఎడమచేత్తో గాడిద కళ్ళాలు పట్టుకొని కొండ మీదకు వెళ్తుంటే ఈ యెబూసు కొండలను తానే స్వాధీనపరచుకొని అందులో ప్రవేశిస్తునంత సంతోషం కలిగింది. తనకు తెలియకుండానే తన రొమ్ము ముందుకు చొచ్చుకొని వచ్చినట్లనిపించింది. చిన్నప్పటి నుండి అమ్మ చెప్పిన సంసోను, గిద్యోను, యెఫ్తా ఈ కథలన్నీ తను నిజంగా వారిలో ఉండి చూచినట్లుగా అనిపించింది. దేవుని వాక్యంలో మార్పులేదు. అమ్మ చెప్పిన మానవుల యెడల దేవుని యధార్థత ఎంత విలువైనది.

"ఇప్పుడు కొండమీదనున్న కోటవైపు ప్రయాణం" షేలహు అన్నాడు "గొల్యాతు ఆయుధాలు నా డేరాలో ఉన్నయి కదా! అవి నోబులో యాజకుడైన అహీమెలెకునకు అప్పచెప్పు" అన్నాడు దావీదు. యెబూసు కోటలో సౌలు ఉన్న విశాలమైన సావడి వద్దకు వచ్చారు. సౌలు తన ఆసనం మీద నుండి లేచి దావీదు దగ్గరకు వచ్చి చేతిలోని గొల్యాతు తలను చూచాడు. అబ్నేరు వచ్చి గొల్యాతు తలను పట్టుకొని ప్రక్క గదిలోనికి వెళ్ళినప్పుడు యోనాతాను అదే గుమ్మము ద్వారా వచ్చి "దావీదు" అన్నాడు ప్రేమగా. ప్రక్కనున్న ఆసనము మీద కూర్చున్నాడు.

"నేటి నుండి నీ తండ్రి ఇంటి వారందరూ స్వతంత్రులు" అన్నాడు సౌలు. "నా ముగ్గురు అన్నలు తమ కొలువులో ఉన్నారు" అన్నాడు దావీదు. "అయిననూ ఇప్పుడు వారు స్వతంత్రులే. వారికి ఇష్టమైతేనే కొలువులో ఉండవచ్చును లేదా వెళ్ళవచ్చు అన్నాడు సౌలు.

"ఇంక గిబియా వెళదాము" అన్నాడు సౌలు అప్పుడే లోనికి వస్తున్న అబ్నేరుతో. సౌలు, అబ్నేరు ముందు నడుస్తుంటే వెనకాల దావీదు భుజము మీద చేయి వేసి నడుస్తున్న యోనాతానును పలకరింపుగా చూసాడు దావీదు. అతని చేతిస్పర్శకు పులకరించిపోయాడు. యువరాజైయుండి తన కంటే పదిహేను సంవత్సరాలు పైవయస్సున్న యోనాతాను తన యెడల చూపుతున్న ప్రేమ ఆదరాభిమానములకు కృతజ్ఞతా పూర్వకంగా చూసాడు.

గిబియా వచ్చిన తర్వాత దావీదు తన గదిలోనికి వెళ్ళి స్నానం చేసికొని రాజు భోజనపు బల్ల యొద్దకు వస్తుంటే యోనాతాను వచ్చాడు. యోనాతాను చూచినప్పుడు, ఆయనతో మాట్లాడేటప్పుడు తన అన్నలతో కాని స్నేహితులతో కాని ఇంతకు ముందు తనకు ఉన్న అనుభూతి, ఆప్యాయతకు మించినదేదో దావీదు హృదయానికి గోచరించింది. యోనాతాను తన వెంట తీసుకొని వచ్చిన దుప్పటిని అందులో ఉంచిన కత్తిని విల్లును దావీదు చేతికి ఇచ్చాడు. అవి ఎంతో

విలువ కలిగినవి. యోనాతాను అత్యధికంగా ప్రేమించే వస్తువులు అవి. దావీదు ఈ సంఘటనకు అవాక్కైపోయాడు. ఆ వస్తువులను పరీక్షగా చూస్తుంటే తన నడికట్టును విప్పిదీసి దావీదు నడుమునకు కట్టాడు. దావీదు యోనాతానును గట్టిగా కౌగిలించుకున్నాడు. అదే విధంగా యోనాతాను కూడా. గొల్యాతును చంపినప్పుడు తన హృదయంలో వెలిగిన భావన కంటే ఈ భావన గొప్పగా అనిపించింది.

ఉదయాన్నే తన తల్లిని, తండ్రిని చూడాలని పించింది. పూర్వం సింహమును, ఎలుగుబంటిని చంపిన ప్పుడు బెత్లేహేమీయులు తనను ఏ విధంగా హెచ్చించారో మరి ఇప్పుడు దేవుడు తన ద్వారా గొల్యాతును హతమార్చి ఇశ్రాయేలీ యులకు జయం చేకూర్చిన తర్వాత తన గ్రామం ఎలా ఉంది? అబీషై ఇక్కడికి వస్తే బాగుండును కదా! తనను రాజు ఎంతో ప్రేమతో గౌరవంతో చూస్తున్నాడు. ఇటువంటి పరిస్థితిలో ఇంటికి వెళ్తానని చెప్పటానికి హృదయం అంగీకరించలేదు. రాజుగారి భోజనబల్ల చాలా పెద్దది. రాజుగారి భోజనపుబల్ల దగ్గర హాజరయ్యే ప్రముఖు లతో తనకు కూడా ఒక స్థానం ఏర్పాటు చేసినట్లుగా తెలిసింది.

యోనాతాను తనతో కలసి భోజనశాలకు బయలుదేరాడు. ఎవరినో చూడాలనే కోరిక బలముగా కలుగుతుంది. కాని ఈ జామున వారు కనబడరని తెలుసు. భోజనశాలలో రాజుగారికి ఎదురుగా గోడ దగ్గరగా తనకు స్థలము. యోనాతాను తన తండ్రి ప్రక్కన, అయితే తన ప్రక్కన ఆయన కూర్చుంటే బాగుండును అనిపించింది. రాజుగారు అప్పటికే కూర్చుని ఉన్నారు. ఆయనను చూచిన తర్వాత తల వంచుకొని పరిచారకుడు తనను వెంటబెట్టుకొని వెళ్ళి తన స్థానం చూపించాడు. ఇదే రాజుగారితో కలిసి భోజనం చేయటం మొదలు ఎంతో విలువైన వ్యక్తులకే ఇక్కడ స్థానం.

తెల్లవారినప్పుడు తాను రాజసముఖమునకు సిద్ధపడు తుంటే యోనాతాను వచ్చాడు. ఇద్దరూ కలసి రాజా స్థానము నకు వెళ్ళారు. నిన్న జరిగిన యుద్ధంలో ఎంతమంది ఇశ్రాయేలు సైనికులు మరణించారు. సైనికులు కూర్చు కొనిన దోపు సొమ్ము ఎంత? రాజనగరునకు వచ్చిన దోపు సొమ్ము ఎంత? మొదలగు వివరాలు గూఢచారుల ద్వారా తెలిసికొనటం దావీదు బాధ్యతగా చేసారు. ఎందుకంటే ఆ యుద్ధంలో ప్రధమ వీరుడు దావీదే కదా!

షెలహుతో కలసి గుఞ్జాల మీద కొంత సైన్యంతో ఏలా లోయవైపుగా బయలుదేరాడు. సాయంకాలంవరకు చాలా మంది శతాధిపతులతోను సహస్రాధిపతులతో మాట్లాడాడు. తన దగ్గరకు వచ్చిన ప్రతి శూరుడు తనను హెచ్చించి ప్రేమగా మాట్లాడారు. అన్నిటికంటే సంతోష కరమైన సంగతి ఏమిటంటే ఈ యుద్ధం జరిగే వరకు సౌలు సైనికులకు సరైన ఆయుధాలు లేవు. ఈ దోపు సొమ్ముతో ప్రతి సైనికునికి మంచి కత్తులు డాళ్ళు, ఈటెలు దొరికాయి. ప్రతి సైనికుడు ఒక కత్తి, ఒక డాలు, ఒక ఈటే ఉంచుకొని మిగిలిన ఆయుధములన్ని కోటలో చేర్చాలని దావీదు చెప్పాడు. ఈ విధంగా ప్రతిరోజు ఏదో ఒక పని తాను నిర్వహించవలసి వచ్చింది. సౌలు రాజు తన యోధులందరి మీద అతని హెచ్చించినప్పుడు యోధులందరూ బహుగా సంతోషించారు.

ఒకనెల గడచిపోయింది. యుద్ధవాతావరణం పూర్తిగా మాసిపోయింది. ఇశ్రాయేలు దేశమంతట విజయో త్సాహ వేడుకలు ప్రకటించారు. సౌలు,దావీదు, యోనాతాను ఒక రథము మీద నిలుచుంటే సైన్యంలో ముఖ్యులు గుఞ్జాల మీద ఆ తర్వాత కొంత కాల్బలము గిబియా నుండి బయలు దేరి ఇశ్రాయేలు పట్టణాలలో, పల్లెల్లో ఊరేగింపు జరిపారు. ప్రతి ఊరిలో స్త్రీలు, తంబురలతోను సంభ్రములతోను, వాద్యములతోను పాటలు పాడుచూ నాట్యమాడుచూ రాజుని ఎదుర్కొన్నారు.

ఆ రాత్రి గిబియా తిరిగి వచ్చిన తర్వాత రాజు ముఖంలో ఉదయం ఉన్న కళ లేకుండా పోయింది. కోటకి వచ్చిన తర్వాత ఎవరితో ఏమి మాట్లాడకుండా అబ్నేరుతో కలసి తన సమాలోచన గదికి వెళ్ళిపోయాడు. అబ్నేరుకు రాజు ప్రవర్తన ఊహించటానికి కష్టంగా ఉంది.

**(సశేషం)**

స్త్రీల విభాగం

# లూదియ

క్రైస్తవ విశ్వాసులకు లూదియ పరిచయం అవసరం లేని పేరు. అలాంటి లూదియను గురించి బైబిల్లో రెండు వచనాలలో మాత్రమే (అ.కా 16:14,40) వ్రాయబడింది. బైబిల్లో ప్రస్తావించిన రెండు వచనాలను ధ్యానిద్దాం.

పౌలు, దర్శనం చేత ప్రేరేపింపబడి మాసిదోనియలోని ఫిలిప్పీ ప్రాంతానికి సువార్త అందించడానికి వచ్చి విశ్రాంతి దినమున ప్రార్థన జరుగును అని నదీతీరాన కూర్చుని, అక్కడ కూడి ఉన్న స్త్రీలకు దేవుని వాక్యం చెప్తున్నప్పుడు లూదియా అనే స్త్రీ కూడ అక్కడ ఉంది.

*"లూదియయను దైవభక్తిగల యొక స్త్రీ వినుచుండెను. ఆమె ఊదారంగు పొడిని అమ్ము తుయతైర పట్టణస్తురాలు. ప్రభువు ఆమె హృదయమును తెరచెను గనుక పౌలు చెప్పిన మాటలయందు లక్ష్యముంచెను"* అ.కా 16:14

**దైవభక్తిగల స్త్రీ :** తుయతైర ప్రాచీన గ్రీకు పట్టణం. ఊదారంగు పొడి అమ్మకంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పట్టణం. సముద్ర తీరం ఉండడంతో మంచి వర్తక కేంద్రంగా ఉంది. ఊదా రంగు పొడిని ప్రపంచానికి పరిచయం చేసిన పట్టణం తుయతైర. ప్రపంచ స్థాయి వ్యాపారం జరుగుతున్నందున తుయతైర, వివిధ రకాల సామాజిక వర్గాల ప్రజలతో, రకరకాల ఆచారాలు, వ్యవహార శైలితో మిళితమైన పట్టణంగా ఉంది.

లూదియ రకరకాల ఆచారాలు పాటించే జనుల మధ్య ఉన్నప్పటికి ఆమె దైవభక్తిని కలిగి ఉంది. లూదియ ఊదారంగు పొడిని అమ్ము స్త్రీ, అంటే బహుశ ఆమె వ్యాపారం రిత్యా సమాజంలో ప్రాముఖ్యమైన స్త్రీ అయి ఉండవచ్చు. బహుశా ఆమె ధనవంతురాలు అయి ఉండ వచ్చు. తన ఆస్తి, సమాజంలో తన స్థితి దేవుని పట్ల ఆమె కున్న ఆసక్తి, తృష్ణను తగ్గించలేకపోయాయి. లూదియ తను ఉంటున్న సమాజంలోని రకరకాల ఆచారాలకు తల ఒగ్గక, యూదా మత ఆచారాలను కొనసాగించి దేవుని పట్ల తన భక్తిని కనపరచింది. తన చుట్టూ ఉన్న సమాజానికి విరుద్ధంగా దైవభక్తిని కొనసాగించడం కష్టతరమైనప్పటికిని, దేవుని పట్ల లూదియకు ఉన్న ఆసక్తి, ఆమె తన భక్తిని కొనసాగించడానికి కారణమైంది.

మరి మనమెలాంటి దైవభక్తిని కలిగియున్నామో ఆలోచిం చాలి, మన భక్తి మన చుట్టూ ఉన్న సామాజిక స్థితిగతులను బట్టి మారని చెక్కు చెదరని భక్తిని కలిగియున్నామా? లేక సమాజంలోని హోదా, ధన స్థితి మన భక్తిని ప్రభావితం చేస్తుందా? పాఠకులు ఆలోచించ మనవి.

**ప్రాధాన్యత:** లూదియ వ్యాపారస్తురాలైనప్పటికి పౌలు ప్రసంగిస్తున్నప్పుడు ఆమె తన వ్యాపారం కంటే దేవుని మాటలు వినుటకు ప్రాధాన్యత ఇచ్చినట్లు చూస్తున్నాం. ప్రతిరోజు చేసే తన పని, తన జీవనోపాధి, సమాజంలో తన స్థితికి కారణమైన వ్యాపారాన్ని పక్కన పెట్టి దేవుని వాక్యాన్ని విన్నది. అంటే, బహుశ ఎప్పటినుండో ఆమె దేవుని మాటలు వినాలి అనే ఆశ కలిగి ఉండి ఉండవచ్చును

***ఏలయనగా ఆశ కలిగిన ప్రాణమును ఆయన తృప్తి పరచియున్నాడు. కీర్తనలు 107:9***

ఎప్పుడైతే లూదియ పౌలు మాటలు విన్నదో అజ్ఞానం తోను, అమాయకత్వంతోను రకరకాల సందేహాలతోను మూయబడి ఉన్న ఆమె హృదయం, దేవుని వాక్యపు వెలుగులో తెరువబడింది. ప్రభువు ఆమె హృదయం తెరచెను అని వ్రాయబడింది అంటే ఎప్పుడైతే దేవుని వాక్యాన్ని వినుటకు ప్రాదాన్యత ఇచ్చిందో, అప్పుడు దైవికమైన స్పష్టత ఆమె హృదయంలో కలిగింది.

**లక్ష్యముంచుట:** ఎప్పుడైతే తన హృదయం తెరవబడిందో అప్పుడు లూదియ పౌలు చెప్పిన మాటలయందు లక్ష్యముం చింది. అంటే పౌలు చెప్పిన మాటలు నమ్మి వాటి ప్రకారం చేయడానికి హృదయంలో నిశ్చయించుకుంది. ఆమె నిశ్చయతకు కూడ రకరకాల సామాజిక, మతపరమైన

ఆటంకాలు కలిగి ఉండవచ్చు. కానీ ఆమె నిశ్చయత చాలా ధృఢమైనదిగా చూస్తున్నాం. నిశ్చయించుకున్న ప్రకారం ఆమె పొందిన విశ్వాసాన్ని రుజువుపరచుటకు ఆమె బాప్తిస్మాన్ని పొందింది.

**సువార్తికురాలు:** లూదియ మంచి సువార్తికురాలు. ఆమె తన ఇంటి వారికి సువార్తను ప్రకటించి వారికి కూడా దేవుని రక్షణను పరిచయం చేసి ఉండవచ్చు అందుకే ఆమె ఇంటివారు కూడా బాప్తిస్మము పొందినారు. అంతేకాదు లూదియ దేవుని సేవకులకు పరిచర్య చేసింది. పౌలు సీలలకు అవసరమైన సమయంలో ఆతిథ్యమిచ్చింది. అంతే కాదు ఫిలిప్పీ దేశంలో సువార్త వ్యాప్తికి సంఘ స్థాపనకు లూదియ తన వంతు సాయం చేసింది.

వినుట వలన విశ్వాసము పొందిన లూదియ ఆ విశ్వాసాన్ని కొనసాగించి, బాప్తిస్మము పొందటమే కాక తన కుటుంబాన్ని రక్షించుకుంది. కాబట్టి నేటి క్రైస్తవ వనితలు వాక్య విరోధమైన సమాజ ఆచారాలను ఎదుర్కోగల ధృఢమైన విశ్వాసం కలిగి ఉండాలి. కేవలం వ్యక్తిగత రక్షణే కాకుండా కుటుంబం రక్షణకై లూదియవలె పట్టుదల, విశ్వాసం కలిగి కుటుంబాన్ని దేవునిలో కట్టుటకు ప్రయాస పడాలి. అంతేకాక ప్రతి స్త్రీ సంఘ పరిచర్యలో, సువార్త సేవలో లూదియవలె దేవుని సేవకులకు సేవ చేసి సువార్త వ్యాప్తిలో పాలుపంపులు పొందుకోవాలని ప్రార్థించుదాము. ఆలాగు చేయుటకు దేవదేవుడు సహాయం చేయును గాక ఆమెన్!

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక – 9 జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 నీ | ళ్ళ | | | 2 సే | | | 3 త్తు | 4 సొ |
| వ | | | 5 మ | న | 6 షే | | | లొ |
| 7 ల | మొ | స | ది | | 8 బ | బు | లో | ను |
| న | | | 9 ము | శ | దే | | | మో |
| | 10 ద | క్షి | ణ | | 11 శ | క | ము | |
| 12 ల | | | 13 న | ట్టి | పు | | | 14 త్రి |
| 15 షె | మూ | యే | లు | | 16 రా | తి | 17 చే | ప |
| తూ | | | 18 ర | 19 ధ | ణి | | | చి |
| 20 మె | ప్పు | | | న | | | 21 కీ | మా |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక – 9**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
2. డి. సురేష్ కుమార్, రెంపడం, విజయనగరం
3. జి.యస్.యస్. ప్రసాద్, వైజాగ్
4. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
5. టి. హదస్సా, ఆదిలాబాద్
6. కె. దివ్యవాణి, బెంగుళూరు
7. శ్రీమతి బి. ఆనీమేరి, హైదరాబాద్
8. కె. లలితభాగ్యం, కనిగిరి

## <u>చందాదారుల వివరములు</u>

1. అపో. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)–1500 (నెలకు)
2. దాసరి శ్యామ్ హయ్యర్ పాల్ – 2000 (నెలకు)
3. గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000 (నెలకు)
4. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/–
5. ముద్ద సామ్యేల్ విల్సన్ – 500 (ప్రతి నెల)
6. జి. స్టాలిన్ (కావలి)
7. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
8. సుమతి చక్రవర్తి
9. దాసరి. మాధవరావు
10. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/–
11. జి. కళావతి, ఒంగోలు 350/–
12. వి. కస్తూరి, భీమవరం 500/–
13. జయ, గుంటూరు – 1500/–
14. కె. రజిని, నరసరావుపేట – 1000/–
15. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/–
16. శ్రీమతి కె. కల్పన, గోవా – 350/–
17. శ్రీ జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి – 350/–

సాక్ష్యము

# రక్షణ

నా పేరు కత్తుల మోషే, మాది సింగరాయకొండ దగ్గర కరేడు. మానాన్నగారు కత్తుల అక్కయ్య. మా తాత మా నాయనను ఇంకొల్లులో వదిలేసి వెళ్ళిపోయారు. కొందరు రైతులు ఆయనను చాకి, విద్యాబుద్ధులు చెప్పించారు. మా అమ్మది చిలకలూరిపేట వద్ద మురికిపూడి. మానాన్న ఆమెను వివాహం చేసుకొనిన తరువాత ఇంటికి పెద్ద కుమారునిగా నేను పుట్టాను. నాకు చెంచురామయ్య అని పేరు పెట్టారు. నాకు ఇద్దరు తమ్ముళ్ళు, నలుగురు చెల్లెల్లు. దిక్కుమొక్కులేక బూదవాడ గ్రామంలో ఒక సత్రంలో మా తండ్రిగారి కుటుంబం నివాసముండగా, ఒక బ్రాహ్మణుని ద్వారా యేసుక్రీస్తు గురించి మా నాన్నగారు తెలుసుకున్నారు. తరువాత బూదవాడ గ్రామంలోనే వెంకటేశ్వర్లు అనే టీచరు ద్వారా సువార్త విని, రక్షణపొంది బాప్తిస్మం తీసుకున్నాడు. మా నాన్న ఒక్కరే రక్షింపబడినాడు

మా నాన్న మాదిగ పల్లె, మాలపల్లెలో ప్రార్ధనలకు తిరుగుతుంటే కులస్థులు వెలివేశారు. మమ్మల్ని పల్లెకు దూరంచేసారు. నన్ను 'రామకూరు'లోనే అప్పర్ ప్రైమరీ స్కూల్లో పదవ తరగతిలో చేర్చారు. పది చదువుతూ నేను అప్పటి రాడికల్స్‌తో తిరిగేవాడిని. వారితో కలసి దేవుడు లేడని నాస్తికత్వంలో అని ప్రకటిస్తూ వాదిస్తు ఉండేవాడిని. మాతండ్రి నాకు అనేకసార్లు దేవుని గురించి చెప్తుంటే ఆయనను కొట్టి అవమానపరిచాను. చివరికి త్రాగుడు, పేకాట, మొదలగు వ్యసనాలకు బానిస అయ్యాను. వివాహం చేస్తే బాగుపడతానని మా మేమమామ–తగూర్తి వెంకటేశ్వర్లు గారి పెద్దకుమార్తె పిచ్చెమ్మతో వివాహం జరిపించారు. 1980లో నాకు వివాహం అయినప్పటికి నా జీవితం ఏమి మారలేదు. కొంపల వెంబడి తిరిగే మురికి జీవితం. సమాజంలో ఎవరికి పనికిరాని వ్యక్తిగా, రౌడిగా ఉండే వాడిని. అలాంటి పరిస్థితుల్లో నాకు పత్తిపాడు గ్రామంలో ఆర్.టి.సి.లో ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ ఉద్యోగం వచ్చింది. సంతానం లేనందున కుటుంబంలో కొన్ని కలతలు ప్రారంభమయ్యాయి. నేను వేరొక స్త్రీని వివాహం చేసుకోవాలని అనుకున్నాను. మా మామగారు కాని, మాతండ్రిగారు గాని అందుకు ఒప్పుకోలేదు. నేను అందరిని ఎదిరించి నాభార్యతో విడాకులు తీసుకోవడానికి సిద్ధపడ్డాను. భార్యని పుట్టింట్లో వదలివచ్చాను. కొన్ని రోజులకి నాభార్య నా వద్దకు వచ్చింది. గ్రామంలో ఉండే పెద్దలను, క్రైస్తవసంఘాన్ని పోగుచేసి నా భర్త నాకు కావాలని పట్టుపట్టింది. అందరు చెప్పిన మాటలనుబట్టి నేను కూడా ఒప్పుకున్నాను. నా భార్య సంతానం కొరకు ఎందరో దేవతలకు మ్రొక్కుకుంది. ఎన్నో వ్రతాలు చేసింది. సోదెలు చెప్పించుకునేది. కాని యేసు ప్రభువు అంటే ఒప్పుకునేది కాదు. క్రైస్తవదేవుడని ఎగతాళి చేసేది. కానీ తాను మ్రొక్కిన ఏ దేవుళ్ళ వలతనకు సంతానం కలుగకపోవడం చూసి చివరికి బిడ్డల కొరకు ప్రార్ధనకు వెళ్ళటం మొదలుపెట్టింది. సంతానం కొరకు ప్రార్ధనచేయగా ఆమె విశ్వాసాన్ని బలపరచే విధంగా దేవుడు ఆమెకు ఒక పాపను ఇచ్చాడు.

అయినప్పటికి నాజీవితంలో ఏమార్పు రాలేదు. విపరీతంగా త్రాగటం, అప్పులు చేయడం. అప్పుల వారికి భయపడి ఇంకా తాగి ఎక్కడ పడితే అక్కడ పడిపోయేవాడిని. ఇంటికి రాకుండా క్లబ్ లోనే ఉండేవాడిని. నేను పెట్టే బాధలు తట్టుకోలేక మాతండ్రి నన్ను బయటికి పంపివేశాడు. పసిగుడ్డు అయిన శిశువును తీసుకొని, నాభార్యతో కలసి పాత ఇనుము వ్యాపారం చేసుకుంటు, చిత్తుకాగితాలు ఏరుకుంటు, చెట్ల కింద పడుకుంటు సింగరాయకొండ చేరాను. ఆ స్థితిలో కొన్ని సార్లు త్రాగుడు మానాలని, బాగు పడాలని, పేకాట మానాలని ఎంత ప్రయత్నంచేసిన నావల్ల కాలేదు. అక్కడ కూడా నా పాత స్నేహితులు నన్ను నా మురికి జీవితంలోకి తీసుకెళ్ళారు. నాజీవితం ఎంత దుర్భరంగా ఉందంటే వ్యసనాలకై అప్పులు చేయడం

ప్రారంభించాను. సెంటు భూమి కూడా లేని నాకు లక్ష రూపాయల దాకా అప్పు ఉంది. అప్పుల పాలై, బాకీలవారు ఎప్పుడు ఇంటికి వస్తారో అని భయపడుతు, ఇంటికి రాకుండా భార్య బిడ్డలను వదిలి ఊళ్ళ మీద తిరుగుతు, చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ కాలం వెల్లబుచ్చాను.

ఒకనాడు బాగా తాగి వచ్చి స్పృహలేకుండా పడి పోయాను. ఆ సమయంలో నాభార్య నా హీనస్థితిని చూచి, నన్ను అసహ్యించుకొని, బిడ్డను నాపక్కలో పరుండపెట్టి, ఆమె ఉరివేసుకోవడానికి ప్రయత్నం చేస్తుంది. ఉరితాడు మీద వేలాడుతున్న ఆమెను దేవుడు జ్ఞాపకం చేసుకొని స్పృహలేకుండా పడిపోయిన నన్ను తట్టిలేపాడు. ఆయన కొట్టిన దెబ్బకు నా ఒళ్ళంతా మంటపుట్టింది. నాకు తెలివి వచ్చి చూసేసరికి కళ్ళముందు నా భార్య ఉరితాడుతో వ్రేలాడుతుంది. నేను త్వరగా పరిగెత్తుకు వెళ్ళి, ఆమెను దించి కొట్టాను. అందుకు ఆమె 'నువ్వు మనిషివి కావు, మమ్మల్ని అల్లాడిస్తూ అందరిని హింసిస్తున్నావు' అని ఏడవడం మొదలుపెట్టింది.

అప్పుడు దేవుడు నాకు ఆలోచన శక్తి ఇవ్వగా – నా జీవితమంతా ఒకసారి జ్ఞాపకం చేసుకొనగా నామీద నాకే అసహ్యం వేసింది. నేను లక్షరూపాయలు అప్పు చేసి ఎవరిని సంతోషపెట్టాను? అని ఆలోచించుకొని బాధపడుతూ చని పోదామని నిశ్చయించుకొని లేచి సింగరాయకొండ దగ్గర సోమరాజుపల్లె రైలుపట్టాల దగ్గర పడుకొన్నాను. చుట్టు దట్టంగ పొగమంచు కమ్మింది. ఒక గూడ్స్ బండి వస్తుంది. ఎవరో గుర్తు తెలియని మనిషి వచ్చి నా చెయ్యి పట్టుకుని నన్ను ఈడ్చుకుని మాఇంటి వద్దకు తీసుకువచ్చాడు. అప్పుల వాళ్ళు వచ్చి నన్ను కొట్టబోయారు. ఊరిపెద్దలందరు వచ్చి నేను బుద్ధిగా ఉంటానని ప్రమాణం చేయించారు. నా భార్య బిడ్డ కలసి మాతల్లిదండ్రులను, జాకబ్ పాస్టర్ గారిని పిలిపించారు. పాస్టర్ గారు 1వ కీర్తన చెప్పారు. ఆ తరువాత నుండి మానాయన దగ్గర బైబిల్ తీసుకొని ప్రతిరోజు సాయంకాలం ఊరిబయట బైబిల్ చదువు కొనేవాడిని. ముప్పై దినముల తరువాత యోహాను సువార్త 19వ అధ్యాయం చదువుతుంటే యేసు ప్రభువు సిలువ శ్రమలు – నా పాపముల కొరకు ఆయన హింసించబడి చంప బడ్డాడు అని తెలుసుకొని దాదాపు 7గంటల సేపు ఏడుస్తూ ఉండి పోయాను. నిజమైన పశ్చాత్తాపం కలిగింది. నా అలవాట్లు, చెడువ్యసనాలను మనస్పూర్తిగా అసహ్యించుకొని విడిచి పెట్టాను. యేసు ప్రభువుని నా స్వరక్షకునిగా అంగీకరిం చాను. బాప్తిస్మం తీసుకున్నాను. 2సంవత్సరాలు విశ్వాసిగా ఉండి ప్రభువు పిలుపు మేరకు సువార్తికునిగా మారాను. సింగరాయకొండ ప్రాంతంలో ప్రతి ఇంటికి వెళ్ళి వాక్యం చెప్పాను. నన్ను అందరు పిచ్చి వాడినని అవమా నించి ఎగతాళి చేశారు. ఆ తరువాత దేవుని దర్శనం ప్రకారం ఇంకొల్లువచ్చి దేవుని వాక్యం ఎరుగని భైరాగులు, చెంచులు, బుడబుక్కల వారు, యానాది, ఎరుకలు వారి మధ్య సేవ ప్రారంభించాను. ఇప్పుడు అన్ని కులముల నుండి ప్రభువుచే పిలువబడిన దాదాపు 100 మంది సభ్యులతో జయకరమైన, ప్రభువుకు మహిమకరమైన సేవ జరుగుతుంది.

భార్య ప్రిస్కిల్లా, కుమార్తెలు పరంజ్యోతి, దయామణి లతో కలసి కుటుంబ సమేతంగా దేవుని సేవలో ముందు కుసాగుతున్నాను. మా సేవ మరింతగా ఫలించాలని, జీవితాంతం దేవునికి సాక్ష్యులుగా బ్రతుకుతూ ఆయనను చేరుకోవాలని మా కొరకు ప్రార్థించండి.

**యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన నామమును ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియచేయుడి. కీర్తనలు 105:1**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడల వాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# అభివృద్ధి

నేడు ప్రపంచమంతయు లోకసంబంధమైన అన్ని విషయములందు అభివృద్ధి పొందుచున్నది అన్నది ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే. ఔను శాస్త్రీయంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుచున్నదని నిస్సందేహంగా చెప్ప వచ్చును. 200 సం॥ల క్రితం ఉన్న ప్రపంచానికి ఇప్పటి ప్రపంచానికి ఎంతో వ్యత్యాసముంది. అప్పటి ప్రయాణ సాధనాలు వేరు, ఇప్పటి ప్రయాణ సాధనాలు వేరు. అప్పుడు దక్షిణ భారతదేశం నుంచి 2 వేల మైళ్ళు కూడాలేని కాశీ పట్టణానికి (కలకత్తా) వెళ్ళి రావడానికి కొన్ని సం॥లు పట్టేది. అందుకే కాశీకి పోయిన వారు కాటికి పోయినట్లే అనే సామెత కూడ పుట్టింది. ఇప్పుడైతే మద్రాసులో ఉదయం టిఫిన్ చేసి విమానంలో కాశీకి పోయి మధ్యాహ్న భోజనా నికి తిరిగి మద్రాసు చేరవచ్చు. అసలు ఒక్కరోజులో ప్రపంచాన్నే చుట్టి రావచ్చు. చంద్ర మండలానికి అంగారక గ్రహాలకి వెళ్లే అంతరిక్ష నౌకలలో అయితే ఒక రోజుకి ఎన్నోసార్లు భూమిని చుట్టి రావచ్చు.

మనిషి సుఖంగా జీవించడానికి ఎన్నో ఆధునిక సౌకర్య ములు కనుగొనబడ్డాయి. కమ్యూనికేషన్‌లు, టి.వి.లు కంప్యూటర్స్, మెడికేషన్ చాలా ఇంప్రూవ్ అయినవి. ఆధునిక యంత్రాంగములు వలన జీవన విధానం చాలా మెరుగు పరచబడినది. అయితే వీటి అన్నిటి వల్ల ప్రపంచం అభివృద్ధి చెందిందనుకుంటున్నామే కానీ నిజంగా చూస్తే హడావుడే గాని మనుష్యులలో అభివృద్ధి ఏమీ కనబడుట లేదు. మానవ జాతి యొక్క నైతిక విలువలు నాగరికత పేరుతో అనాగరి కతలోకి దిగజారిపోతున్నాయి. మానవుడు సుఖంగా జీవించ టానికి కనుగొనబడిన అత్యాధునిక సాధనాలు ఏవీ కూడ మనిషికి సుఖశాంతులను ఇవ్వకపోగా, ధనాపేక్ష, డంబము వంటి దుర్గుణాలు పెరిగినవి. అశాంతి ప్రబలి పోయింది. అక్రమం విస్తరించింది. మొత్తంగా చెప్పాలంటే అక్రమమే క్రమమైపోయింది. అభివృద్ధి చెందినవి, చెందుతున్నవని చెప్పబడే దేశాలలోకి వెళ్ళి చూస్తే వారి కట్టడాలు ఎంత ఎత్తుకు మేఘాలలోకి దూసుకువెళ్తున్నాయో వారి నైతిక విలువలు క్రిందకి దిగజారిపోయినట్లుగా కనబడుతుంది. అలాగే ఈనాడు మనుష్యులు ధనార్జనే ధ్యేయంగా కోట్ల కొలది ఆస్తులు సంపాదిస్తున్నారు. ఆస్తులు సంపాదించడానికే తమ బిడ్డలను చదివిస్తున్నారు. ఆనాడు 'కోటివిద్యలు కూటి కొరకే' ఈనాడు 'కోట్ల కొరకే కోటి విద్యలు' ఇదే అభివృద్ధి అనుకుందాం. ఈ విధమైన అభివృద్ధిలో కనబడుతున్న కుటుంబంలో గాని, వ్యక్తులలో గాని, నిజమైన సంతోష సమాధానాలు మచ్చుకైన కనబడవు. "ఒకడు సర్వలోకమును సంపాదించి వాని ప్రాణమును పోగొట్టుకొనిన వానికి ఏమి ప్రయోజనము" అని వ్రాయబడింది. అదే విధంగా మిద్దెలు, మేడలు, ఆస్తులు, భూములు సంపాదించి సంతోషంగా తినలేని, నిద్రపోలేని జీవితం వ్యర్థం. నిజమైన అభివృద్ధి దేవుని ఆశీర్వాదము వలన లభిస్తుంది. మరియు దేవుడు ఒకనికి ధనధాన్యసమృద్ధి ఇచ్చి దానియందు తన భాగము అనుభవించుటకును, అన్న పానములు పుచ్చుకొనుటకును తన కష్టార్జితమందు సంతోషించుటకును, వీలుకలుగజేసిన యెడల అతనికి ఆ స్థితి దేవుని ఆశీర్వాదము వలన కలిగి నదనుకొనవలెను. అట్టి వానికి దేవుడు హృదయా నందము దయచేసియున్నాడు (ప్రసంగి 5:19). అన్న పానములు పుచ్చుకొనుటకంటెను తన కష్టార్జితము చేత సుఖపడుట కంటెను నరునికి మేలు కరమైనదేదియు లేదు. ఆయన సెలవు లేకుండా భోజనము చేసి సంతో షించుట ఎవరికి సాధ్యము? (ప్రసంగి 2:24-25) కనుక ఆస్తులు, లోకజ్ఞానం, పదవులు సంపాదించుకొనుటలోను కనబడే అభివృద్ధి నిజమైన అభివృద్ధి కానే కాదు ఎందుకనగా వీటి వలన ప్రపంచంలో అవినీతి అక్రమము ప్రబలి మాన వుడు నైతికంగా దిగజారిపోయి అశాంతిలో జీవిస్తు న్నాడు. నిజమైన సుఖశాంతులు ప్రసాదించేదే అభివృద్ధి. ఈ నిజమైన సంతోషం దేవునివలనే కలుగుతుంది. అదే నిజమైన అభి వృద్ధి అదే నిజమైన ప్రగతి. ఇది దేవుని తోడ్పాటు వలన కలుగుతుంది. యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులు

# కలిగిన వాటితో తృప్తి చెందండి

'ఆరోగ్యమే మహా భాగ్యము' అన్న నానుడి మనకు తెలుసు. అయితే మనిషి దేవుడు ఇచ్చిన ఆ మహా భాగ్యాన్ని మహా శాపంగా మార్చుకుంటున్నాడు. ఎలాగంటారా, దేవుడిచ్చిన ఆ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి ధన సంపాదన కోసం మనిషి పడే ఆరాటం ఆ మనిషిని అనారోగ్యానికి గురిచేస్తుంది. *'దేవుడు నరులను యథార్థవంతులనుగా పుట్టించెను గాని వారు వివిధమైన తంత్రములు కల్పించుకొని యున్నారు' (ప్రసంగి 7:29).* దేవుడు మనుష్యులను యథార్థంగా పుట్టిస్తే మనుష్యులు ఎలాగైతే తమ సొంత ఆలోచనలతో ఆ యథార్థతను పోగొట్టుకున్నారో, అలాగే, దేవుడు ప్రతి మనిషికి ఆశీర్వాదముగా ఆరోగ్యాన్ని దయచేస్తే, మనుష్యులు దానిని తమకు శాపముగా మార్చుకుంటున్నారు. ధనము విషయములో 'తగినంత' 'మితము' అనే మాటలు మనిషికి రుచించవు. ధన సంపాదన అనేది మనిషికి ఒక వ్యసనంగా మారింది. చాలామంది తాము సంపాదించిన ధనమంతా ఆరోగ్యం సంపాదించుకోడానికే ఖర్చు చేస్తుంటారు. హెల్త్ ఇన్సూరెన్స్ అని, లైఫ్ ఇన్సూరెన్స్ అని దేవుడిచ్చిన ప్రాణానికి, ఆరోగ్యానికి వెలకట్టి డబ్బు దాచుకుంటుంటారు. *'నేను నీకు ఆరోగ్యము కలుగజేసెదను' (యిర్మీయా 30:17)* అని దేవుడు చెప్పిన మాటలు నమ్మే ధైర్యం మనకు లేదు.

ఆరోగ్యమన్నది మనుష్యులకు దేవుడిచ్చిన వరం. అలాంటి ఆరోగ్యాన్ని మనుష్యులు డబ్బుతో కొనాలనుకుంటారు కానీ అది వారి వల్ల కాదు. డబ్బుతో నయంకాని ఎన్నో జబ్బులు మనకు తెలుసు. కేన్సర్, షుగర్, ఎయిడ్స్ ఇలాంటి మరెన్నో జబ్బులు మనిషి ధనాపేక్షకు ఒక సవాలు. వారు సంపాదించిన ఆస్తినంతా ఇచ్చినా వారి జబ్బు నయం కాదు. అలాంటి జబ్బులు నయం చేసుకోడానికి మరలా దేవుని దగ్గరకు రావాల్సిందే. జీవితాంతం కష్టపడి సంపాదించిన డబ్బంతా ఒక్క జబ్బుతో ఖాళీ. ఇదంతా అవసరమా? డబ్బు జోలికి వెళ్ళడం జబ్బులు తెచ్చుకోవడం, బాధలుపడటం, ఏడుపులు, పెడబొబ్బలు ఇవన్నీ మనిషి ఏరి కోరి తెచ్చుకొనేవే. *'యెహోవా ఆశీర్వాదము ఐశ్వర్యమిచ్చును' (సామెతలు 10:22)* అన్న వాక్యాన్ని డబ్బుతో పోలుస్తారు. మరి ఆ డబ్బుతో ఆరోగ్యాన్ని కొనలేనప్పుడు ఆ డబ్బు ఏం చేసుకుంటాము. నయంకాని జబ్బుతో మంచాన పడ్డ వాళ్ళకి డబ్బు అక్కరకు రాదు కదా. ఆరోగ్యం, తెలివితేటలు ఉన్నప్పుడే ఏమైనా సంపాదించ గలము. యోబు సర్వం కోల్పోయినప్పుడు సాతాను దేవునితో *'తన ప్రాణమును కాపాడుకొనుటకై తనకు కలిగినది యావత్తును నరుడిచ్చును గదా'* (యోబు 2:4) అన్న మాటలకి అర్థం ఆరోగ్యం ఉంటే తిరిగి అన్నీ సంపాదించుకుంటాడు కదా అని.

దేవుడిచ్చే ఆరోగ్యం, తెలివితేటలే మనకు ఐశ్వర్యము. కలిగిన వాటితో తృప్తిపడటమంటే దేవుడు మనకిచ్చిన ఆరోగ్యము, తెలివితేటలతో తృప్తిపడటము. దేవుని మాట విని, ఆయన ఆజ్ఞలకు లోబడి, ఆయనను ప్రేమిస్తే దేవుడు మనకు దయచేసిన ఆరోగ్యం మనకు ఆశీర్వాదంగా మారుతుంది. లేదంటే ఆ ఆరోగ్యమే మనకు శాపమై లేనిపోని రోగాలు తెచ్చుకొని, మనం కూడబెట్టుకున్న ఆస్తింతా హరించుకుపోతుంది. ఏ మాత్రమును ధనాపేక్ష లేక మనకు కలిగియున్న దేవుడిచ్చిన ఆరోగ్యం, తెలివితేటలతో తృప్తి చెందుదాము. ఈ లోకంలో ధనాపేక్ష లేకుండా దేవుని మీద ఆధారపడి, నిన్ను ఏ మాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అన్న దేవుని కాపుదలలో నిశ్చింతగా బ్రతుకుదాం.


## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

# చీకటిశక్తుల నుండి విడుదల

నా పేరు మొహిద్దీన్ బాషా. గుంటూరు జిల్లా అచ్చంపేట మండలంలోని ఊటుకూరు నా స్వగ్రామం. 1988 లో తెనాలి ఆర్.టి.సి. డిపోలో డ్రైవర్‌గా నాకు ఉద్యోగం వచ్చింది. 1991లో సత్తెనపల్లి డిపోకు మార్చ బడ్డాను. సత్తెనపల్లి రాజులకాలనిలో ఇల్లుకట్టుకొని నివాసం కొనసాగిస్తున్నాను. మూర్ఖ స్వభావం గలవాడిని. బహు కోపిష్టిని. ఇరుగుపొరుగు వారితో సమాధానంగా ఉండే వాడిని కాను. నాగులుమీరా పుట్టకు, దర్గాకు కుటుంబ సమేతంగా పూజ చేసేవారము. నమాజుకు వెళ్ళేవాడను కాను. మా వీధిలోనే నివాసముంటూ మైకు ద్వారా ప్రార్థన జరిగిస్తున్న అమీర్ జాన్‌గారిని, వారి భార్యను, నేనూ నా భార్య ఎంతగానో అపహసించి మాట్లాడినాము. అప్పట్లో వారు సత్తెనపల్లి డిపోలో కండక్టరుగా పని చేస్తున్నారు.

ఇలా జరిగిపోతున్న కాలంలో మా ఇంట్లో ఒళ్ళు కాల్చుకున్న మనిషిలాగా ఒక రూపాన్ని చూసే వాడను. ఆ రూపాన్ని ప్రత్యక్షంగా నా కళ్ళతో చూచి చాలా భయపడే వాడను. అది కనబడకుండా ఉండాలని ఇంటికి తాయత్తులు, నిమ్మకాయలు, దారాలు ఎన్నో కట్టించాను కాని ఫలితం లేదు. మాంత్రికులు చేప్పేవన్ని చేశాను ఫలితం శూన్యం. 16-1-2000న సత్తెనపల్లి నుండి గుంటూరుకు నేను సర్వీసు చేయుచుండగా సాయంత్రం 6:30 ని॥ లకు నాకు అర్థం కాని రీతిలో ఆకస్మాత్తుగా ఒక వ్యక్తి (మిర్చి యార్డులో పనిచేసే కార్మికుడు) నా బస్ క్రిందపడి చనిపోయాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి జరిగిన సంగతి తెలియజేసి బస్సును అక్కడపెట్టి ఇంటికి వచ్చి పడుకున్నాను. ఆ చీకటి శక్తి మీసాలు దువ్వుతూ నాకు మరలా కనిపించాడు. ఆ తర్వాత రోజు దర్శనం కలిగింది. ఒక టేబుల్ మీద ఒక ఫైల్ కనపడింది. దాని మీద ఒక చేయి తెల్లని కాగితంపై ఎర్రని అక్షరాలు వ్రాస్తున్నట్లు కనిపించింది. ఈ దర్శనం కలిగిన వారం రోజులలోపులోనే నేను ఉద్యోగం నుండి సస్పెండ్ చేయబడ్డాను. ఆ తర్వాత ఉద్యోగం నుండి కూడా తొలగించ బడ్డాను. జీవితం దుర్భరంగా మారిపోయింది. అప్పులు చేసి వేలరూపాయలు మాంత్రికులకు ఖర్చు చేశాను. ఫలితం లేదు. ఒకనాడు మక్కెన గ్రామం నుంచి ఒక మాంత్రికుని పిలిపించాను. అతడు ఒక కొత్త కుండను తెప్పించి కొత్త టవల్, పూలు వగైరా అందులో పెట్టి మా ఇంటి మెట్ల క్రింద గుంత తీయించి నా చేత పాతి పెట్టించాడు. ఆ రోజు నుంచి ఆ చీకటి శక్తి నాలో ప్రవేశించింది. తలలో ముళ్ళు గుచ్చుకుంటున్నట్లు బాధ కలుగుతున్నది. అన్నంతిన్న తర్వాత కడుపులో గడబిడా శబ్దాలు ప్రారంభమయ్యేవి. తిన్న ఆహారమంతా ఆ శక్తి తినివేసేది. కుటుంబ పోషణ కష్టమై పోయింది. ఇల్లు అమ్ముకునే పరిస్థితులు వచ్చాయి. నా బంధువులు చాలామంది నా యొద్దకు వచ్చి నన్ను చూచి భయపడి వెంటనే వెళ్ళిపోయేవారు. వచ్చి చూడడం తప్ప మరెలాంటి సహాయం వారు చేయలేదు.

మా పెద్దనాన్న కుమారుడు షేక్ మాబు సుభాని నన్ను శ్రీకాకుళంలోని మాంత్రికుని యొద్దకు తీసుకువెళ్ళాడు. అక్కడ కూడా నా బాధలు ఎక్కువైపోయాయి తప్ప ఫలితం కనిపించలేదు. ఒళ్ళంతా మంటలు పుట్టాయి. మూలికల కషాయం కూడా త్రాపించారు. దాని వల్ల ఇంకా నీరసపడి పోయి చిక్కిశల్యమై పోయాను. ఇక ఆశలు వదులుకొని ఇంటికి చేరాను. ఆ మాంత్రికుడు నా ఇంట్లో ఉన్న కుండను గూర్చి మాట్లాడుచూ అది తీసివేసిన వెంటనే చనిపోతావు లేకపోతే పిచ్చివాడవైపోతావు. తీసి వేయకపోతే క్రమ క్రమంగా చచ్చిపోతావు అన్నాడు. నేను ఇంటికి వచ్చి జీవితంపై ఆశలు వదులుకున్నాను. నా భార్య బిడ్డలు అందరం ఏడ్వటం ప్రారంభించాము.

ఇది జరగకముందు అనగా ఉద్యోగం పోయినప్పుడు గుంటూరు సి.టి.యం.గార్కి అప్పీలు పెట్టుకున్నాను. అప్పుడు మరల నాకు దర్శనం కలిగింది. ఆ దర్శనం కూడా మొదటి దర్శనమును పోలినదే. ఒక టేబులు, దాని మీద ఫైలు, ఒక చేయి తెల్ల కాగితంపై ఎర్రని అక్షరాలు కనిపించాయి.

అప్పీలు తిరస్కరించబడినది. మరలా ఆర్.యం.గారికి అప్పీలు పెట్టుకున్నాను.

ఇలా జరుగుతున్న కాలంలో మా ఇంటికి సమీపమున నన్ను ఒక సహోదరి తామాసమ్మ (దేవి) ఆదివారం రోజున నన్ను మా వీధిలోని ప్రార్ధనా మందిరమునకు తీసుకొని వెళ్ళినది. పాస్టర్ విల్సన్‌గారు వారి సతీమణి మొట్టమొదట నా కొరకు ప్రార్ధన చేశారు. ఆ తర్వాత మా ఇంటికి సమీపంలో ఉన్న సుబ్బారావు కండక్టర్‌గారు అయ్యన్నగారు, నన్ను సహోదరి జయమ్మ గారికి పరిచయం చేశారు. వారంతా చుట్టు మూగి ప్రార్ధన చేశారు. క్రైస్తవ సహోదరుల ప్రేమను ఆ సమయంలో తెలుసుకున్నాను. వారు నా కోసం ఉపవాసాలుండి కన్నీటితో ప్రార్ధించారు. నాలో నుండి 4 శక్తులు బయటికిపోవడం నాకు అర్ధమైనది. ఫుల్‌గాస్పెల్ చర్చి పాస్టర్ సుధీర్‌కుమార్‌గారు విశ్వాసులు నా కొరకు ఎంతగానో ప్రార్ధించారు. యేడు నక్షత్రములు పత్రిక ఎడిటర్ గారు సత్తెనపల్లిలో హోలీనైట్ కార్యక్రమం నిర్వహిస్తుండగా అక్కడకు వెళ్ళి నా పరిస్థితి చెప్పి ప్రార్ధన చేయించుకున్నాను. వారు కూడా నా నిమిత్తం ఎంతగానో ప్రార్ధించారు.

ఒకరోజు నాగార్జుననగర్ ఫుల్ గాస్పల్ చర్చిలో నేను ప్రార్ధనలో ఉండగా మరొక దర్శనం చూశాను. ఒక టేబుల్ మీద ఫైల్ ఉన్నది. ఏదో వ్రాయబోవుచుండగా చేతిలోని పెన్ను క్రింద పడిపోవడం, ఆ చేయి వంకర తిరిగిపోయి పిచ్చిగోళ్ళు మొలచి వికారంగా మారిపోవడం జరిగింది. మరికొన్ని రోజుల తర్వాత మరొక దర్శనం చూశాను. ఒక పెద్ద అరుగు అరుగుపైన ఒక చెక్క కుర్చీ అందులో తెల్లని వస్త్రములు ధరించిన వ్యక్తి ఉన్నాడు. నేను వెళ్ళి చేతులు కట్టుకొని ఆయన వద్ద నిలుచున్నాను. ఆయన ఒక మనిషిని పిలిచి నా వైపు చూపించాడు. ఆయన నన్ను గదిలోనికి తీసుకువెళ్ళి ఒక కాగితం నా చేతికిచ్చాడు. తెల్లవారిన తర్వాత ఆ దర్శనం గురించి సహోదరులందరికి తెలియపర్చగా వారు నీకు దేవుడు మరలా ఉద్యోగం ఇప్పించాడు. ధైర్యంగా ఆఫీసుకు వెళ్ళమని చెప్పినారు. వారి వద్ద ప్రార్ధన చేయించుకొని గుంటూరు ఆర్.యం. గారి ఆఫీసుకు వెళ్ళాను. వెంటనే నాకు దర్శనంలో స్పష్టంగా కనిపించిన వ్యక్తి అక్కడ నన్ను చేర్చుకొని ఉద్యోగం ఆర్డరు కాపిని నాకిచ్చి మాచర్ల వెళ్ళి డ్యూటిలో జాయిన్‌కమ్మని చెప్పడం జరిగింది. ప్రభువు ఎంత ఆశ్చర్యకరుడో వర్ణించ లేను. మాచర్ల వెళ్ళి 7-3-2001న ఉద్యోగంలో తిరిగి చేరాను. ఇది జరగక ముందున ఉద్యోగం కోసం రాజకీయ నాయకులనెందరినో ఆశ్రయించి విఫలుడయ్యాను. 17-10-2001న నాపై పెట్టిన క్రిమినల్ కేసు కూడా గుంటూరు కోర్టులో కొట్టి వేయబడినది. నాకు కలిగిన మరి ఒక దర్శనమునుబట్టి ఇంటిలో పాతిపెట్టియున్న కుండను కూడా తీసి పారవేశాను. ప్రభువు కృపనుబట్టి క్రమ క్రమంగా నాకు పూర్తి ఆరోగ్యం చేకూరినది. మాచర్ల లోని క్రైస్తవ సహోదరుల సహవాసంలో విశ్వాసంలో బలపడి బాప్తిస్మం కూడా పొందాను. ఫుల్‌గాస్పెల్ చర్చి వ్యవస్థాపకులు అబ్రాహాము సుధాకర్‌గారు కూడా నా నిమిత్తం ప్రార్ధించారు. శ్రావణ్ పాస్టరుగారు మాచర్లలోని దేవదాసు పాస్టర్‌గారు యిర్మియా పాస్టర్‌గారు, ఐ.జేమ్స్ పాస్టర్‌గారు, రాజుగారు, క్రిష్టాఫర్‌గారు నా నిమిత్తమై ఎంతగానో ప్రార్ధించారు. సహోదరి మేరి (దుర్గ) అను దైవజనురాలు ఆమెతో కూడ ఉన్న విశ్వాసులు కూడ నా గురించి ఎంతగానో ప్రార్ధన చేసియున్నారు.

నా పేరు బర్నబా ప్రభుదాస్ కుమార్‌గా మార్చబడినది. ఆర్ధిక సమస్యల నుండి విడుదల పొందాను. ఇప్పుడు పిడుగురాళ్ళ డిపోలో పనిచేస్తూ సమాధానంగా జీవిస్తున్నాను. ఆయా ప్రాంతాలు తిరిగి నన్ను చీకటి శక్తుల నుండి విడిపించిన ప్రభువు నామమును గూర్చి అనేక చోట్ల సాక్ష్య మిస్తున్నాను. దేవుడు నాకు గాన పరిచర్యను కూడా ఇచ్చాడు. ప్రభు ప్రేమను గాని, ఆయన బిడ్డల ప్రేమనుగాని ఎన్నటికిని మరచువాడను కాను. జీవిత పర్యంతం ఆయన సాక్షిగా జీవించే కృప నాకు చాలునని దేవుని ప్రార్ధిస్తున్నాను. మీ అందరు నా గురించి నా కుటుంబము గురించి ప్రార్ధించా లని కోరుకుంటున్నాను. ప్రభువు నామమున అనేకులు చీకటి శక్తుల నుండి విడిపించబడాలని నా ఆకాంక్ష. ప్రభుకృప మనందరికి తోడైయుండునుగాక. ఇట్లు, మీ ఆత్మీయ సహోదరుడు, **షేక్ మొహిద్దీన్ బాషా, సత్తెనపల్లి.**

చిన్నపిల్లల పేజి

# మార్పు

శనివారం సాయంత్రం స్కూల్ నుండి వచ్చి బిజీగా ఏదో వర్క్ చేసుకుంటున్న షారోన్‌తో, రేపు ఆదివారమే కదా ఏంటి సిరీయస్‌గా వర్క్ చేసుకుంటున్నావ్? ఏదైనా ప్రాజెక్ట్ వర్క్ ఇచ్చారా? అడిగింది తల్లి. లేదు మమ్మీ, ఇది సండేస్కూల్ వర్క్. మీకు ఎవరి మీదైతే ఎక్కువ కోపం ఉంటుందో వారి చిత్రం గీసుకురమ్మంది సండేస్కూల్ టీచర్ అందుకే రేఖ బొమ్మగీస్తున్న అంది షారోన్. ఎవరీ రేఖ? అడిగింది తల్లి. రేఖ నా క్లాస్‌మేట్ కాని తనంటే నాకు చాలా కోపం. ఎప్పుడు ఏదో ఒకటి అంటూ నన్ను ఏడిపిస్తుంటుంది స్కూల్లో. నాకు తనకంటే ఎక్కువ మార్కులు వస్తున్నాయని దానికి కుళ్ళు. నేనేమి చేయకపోయినా ఏవేవో అబద్ధాలు చెప్పి టీచర్స్ దగ్గర నన్ను బ్యాడ్ చేయాలి అని ప్రయత్నిస్తుం టుంది. ఫ్రెండ్స్‌తో నా మీద చాడీలు చెప్తుంది. అందుకే నాకు రేఖ అంటే కోపం చెప్పింది షారోన్ గుక్కతిప్పుకోకుండా.

సండేస్కూల్‌లో ప్రతి ఒక్కరి చేతిలో ఒక చార్ట్ ఉంది. కొందరు తమ తోబుట్టువుల చిత్రాలు గీసుకువచ్చారు. టీచర్ పిల్లలు తాము తెచ్చిన చిత్రాలను ముందుగా ఏర్పాటు చేసిన టార్గెట్ బోర్డ్ మీద అంటించమన్నది. తర్వాత ప్రతి ఒక్కొరు తమ శత్రువు (తమకు కోపం ఉన్న వ్యక్తి) మీద తమ కోపం పోయే వరకు బాణాలను విసరమని చెప్పి బాణాలు (డార్ట్స్) అందుబాటులో పెట్టింది. పిల్లలందరూ తమ కోపం పోయే వరకు బాణాలు విసిరారు. శత్రువు ముక్కు, కళ్ళు గురిగా పెట్టుకొని గురి తగలగానే నిజంగా వారినే కొట్టినట్టు ఫీలౌతు, సండేస్కూల్ అయినందున ఎవరూ పైకి తిట్ట కుండా మనసులో తిట్టుకుంటూ పాత సంగతులను గుర్తు చేసుకుంటూ తమ శక్తి కొలది బాణాలు విసిరి ఇంచు మించుగా అలసిపోయారు. బాణాలు విసరడం అయిన తర్వాత టీచర్ ఎవరి చార్ట్ వారు తీసుకొని వచ్చి కూర్చొ మన్నది. అందరూ తమ చార్ట్స్ తీసుకొని వచ్చి కూర్చున్నారు.

సండేస్కూల్ టీచర్ పిల్లలతో అందరి కంటే ఎక్కువ బాణాలు ఎవరు వేశారు అని అడిగింది. ఎక్కువ బాణాలు వేసిన వారికి ఏదైనా బహుమతి ఇస్తారేమో అని అందరు తమ చార్ట్ మీద ఉన్న బాణాల గుర్తులను లెక్కించి టీచర్‌కు చెప్పసాగారు. టీచర్ మీ మీ చార్ట్స్ వెనుక త్రిప్పి చూడమంది. చార్ట్స్ త్రిప్పి చూసి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే వారి చార్ట్స్ వెనుక యేసుప్రభువు చిత్రం ఉంది. తాము విసరిన బాణాలు యేసుకు గుచ్చుకొని ఉండడంతో అందరూ నిశబ్ధంగా కూర్చున్నారు తలలు వంచుకొని. అప్పుడు టీచర్ చిన్నగా పిల్లలూ మీరు వేసిన బాణాలు ఎవరికి గుచ్చు కున్నాయి? మీ శత్రువుకా లేక యేసయ్యకా? యేసయ్యకే కదా. అంటే మీరు ఇప్పటి దాకా బాణాలు వేసింది బాధపెట్టింది యేసయ్యను. యేసయ్య భూమ్మీద ఉన్నప్పుడు ఏమి చెప్పాడో తెలుసా? “మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను” మత్తయి 25:40 అని కాబట్టి మనం ఎవరినైనా ఉద్దేశపూర్వకంగా బాధపెడితే మనం బాధ పెడుతుంది వారిని కాదు యేసయ్యను. కాబట్టి మనం మన ఫ్రెండ్స్‌తో, తోబుట్టవులతో, తోటివారితో ఎలా వ్యవహ రిస్తున్నమన్నది చాలా చాలా ప్రాముఖ్యమైనది. ఇతరులు మీతో ఎలా వ్యవహరించాలని మీరు కోరు కుంటారో మీరు వారితో అలా వ్యవహరించాలి అని చెప్పబడింది

సండేస్కూల్ అయిపోయినప్పటికి తాను యేసుపై బాణాలు వేసిన సంగతి షారోన్ హృదయంలో నిలిచి పోయింది. షారోన్ ఆ తరువాత రేఖను శత్రువుగా చూడా లనుకోలేదు. రేఖ మాటలకు కోపం వచ్చినా తను బాణాలతో కొట్టిన యేసు చిత్రం గుర్తుకు వచ్చిన వెంటనే మౌనంగా ఉండేపోయేది. మొదట్లో కొంత కష్టంగా ఉన్నప్పటికి ఆ తరువాత షారోన్ రేఖను శత్రువుగా చూడటం మానేసింది.

షారోన్ ప్రవర్తన గమనించిన రేఖ కూడా మౌనం వహించాల్సి వచ్చింది.

నాసా సంస్థవారు నిర్వహించే టాలెంట్‌టెస్ట్‌కు హాజర వ్వడానికి వచ్చిన షారోన్ తన హాల్‌టికెట్ మిస్ అయ్యిందని గుర్తించింది. టైం అయిపోతుంది. పిల్లలందరూ తొందర తొందరగా పరీక్ష హాల్‌లోకి వెళ్తున్నారు. తన హాల్‌టికెట్ ఎవరికైనా దొరికిందా అని అడిగినా సమాధానం కూడా చెప్పట్లేదు ఎవ్వరూ. ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. హాల్ టికెట్ దొరకాలని మనసులో ప్రార్థించసాగింది తను పరీక్ష వ్రాయడం కుదరదని అర్థమై వెనుతిరిగే క్షణంలో అకస్మత్తుగా షారోన్ ముందు ఒక హాల్ టికెట్ రెపరెపలాడింది. అది చూడగానే షారోన్ ఒక్కసారిగా ఇది నా హాల్‌టికెట్ అని అరచి సంతోషంతో తన హాల్‌టికెట్ పట్టకొని ఉన్న చేతిని చూసి ఆశ్చర్య పోయింది ఆ చేయి రేఖది. థ్యాంక్స్ చెప్పి హాల్‌టికెట్ తీసుకొని పరీక్ష హాల్‌లోకి వెళ్ళారు.

పరీక్ష తరువాత వెదికినా రేఖ కనబడలేదు షారోన్‌కు. ఇంటికి వెళ్ళినా షారోన్ రేఖ గురించే ఆలోచించసాగింది. పరీక్ష ఎలా వ్రాశావే అన్న తల్లి మాటతో ఈ లోకంలోకి వచ్చింది షారోన్. బాగానే వ్రాశాను మమ్మీ కానీ... కానీ ఏంటి? అడిగింది తల్లి ఆతృతగా. షారోన్ పరీక్ష ముందు జరిగిన సంగతి తల్లికి వివరించి మమ్మీ రేఖకు నా హాల్ టికెట్ దొరికితే అది ఖచ్చితంగా చించేస్తుంది, దాచేస్తుంది లేదా ఇంకేదైనా చేస్తదేమో కాని ఖచ్చితంగా నాదాకా రానివ్వదు. ఎందుకంటే అన్ని విధాల తను నాకంటే ముందుండాలని కోరుకుంటుంది. అందుకు ఏమైనా చేస్తుంది అలాంటిది తనే తెచ్చి నా చేతికి ఇచ్చింది నాకు తన ప్రవర్తన అస్సలు అర్థంకావడం లేదు. రేఖ అలా ప్రవర్తించగలదని నేను ఊహించలేకపోతున్నాను మమ్మీ అన్నది షారోన్. నువ్వు దేవున్ని బట్టి రేఖను ద్వేషించడం మానేశావు కాబట్టి దేవుడు నీ శత్రువును నీకు మిత్రురాలిగా చేశాడు. కాబట్టి ఈ క్రెడిట్ అంతా యేసయ్యదే అన్నది తల్లి. ఇద్దరూ మోకాళ్ళూని దేవునికి కృతజ్ఞతలు తెలిపారు.

# మీరు బైబిలంతా చదివేశారా?

దేవుడు మానవులకు ఇచ్చిన గొప్ప వరం బైబిలు గ్రంథము. ప్రపంచంలో మొదటిసారిగా ముద్రింపబడినది బైబిలు. ప్రపంచంలోనే అనేక భాషలలో, ఎక్కువ ప్రతులు ముద్రింపబడినది బైబిలు. ఈ భూమ్మీద మనం జీవించినంత కాలంలో మనల్ని సరైన మార్గంలో నడిపించేది బైబిల్ మాత్రమే. మనం దేవుని గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే బైబిల్ ద్వారానే తెలుసుకోగలం. చాలామంది గంటల తరబడి ప్రార్థన చేస్తారుగాని, బైబిలు ఎక్కువగా చదవరు. ఒకవేళ చదివినా ఏదో మన అవసరానికి చదువుతారే కాని, దేవుని గురించి తెలుసుకోవటానికి చదవరు. చాలామంది వాళ్ళ జీవితంకాలంలో ఒక్కసారన్నా బైబిలును పూర్తిగా చదవలేక పోవటం చాలా శోచనీయం. చాలా భక్తిగల క్రైస్తవులకు సైతం బైబిలు ఒకసారి పూర్తిగా చదువుదామన్న ఆలోచన కూడా రాకపోవడం విచారించదగ్గ విషయం. మనం ఒకరోజులో ఎంత సమయం వృధా చేస్తున్నామో ఆ సమయంలో కొంత సమయం బైబిలు చదవటానికి కేటాయించినా బైబిలు పూర్తిగా చదవటం ఏమంత కష్టం కాదు. మనకు కష్టం వచ్చినప్పుడో, మనం అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడో బైబిలు చదవటం కాదు, ప్రతిరోజూ కొంత సమయం బైబిలు చదవటానికి కేటాయించాలి. ప్రతిరోజూ మనం టీ.వి. చూడటానికి, ఆటలు ఆడటానికి ఎంత సమయం వెచ్చిస్తున్నామో, ఎంత సమయం వృధా చేస్తున్నామో మనకు తెలుసు. మనం దేవున్ని పరిశీలనగా తెలుసుకోవాలంటే అది బైబిలు చదవటం ద్వారానే తెలుసుకో గలము. కానీ సాతాను మనల్ని ఆ పని చెయ్యనియ్యదు. ఈనాడు అనేకమంది క్రైస్తవులు చెప్తున్న కారణం బైబిలు అర్థంకావటం లేదని. ఆసక్తి లేకుండా చదివితే ఏదీ మనకు అర్థం కాదు. దేవుని గురించి పరిశీలనగా తెలుసుకోవాలన్న ఆసక్తితో చదివితే దేవుడు మనకు తప్పక సహాయపడతాడు. మీరు ఇప్పటి వరకు బైబిలు పూర్తిగా చదవకపోయినట్లయితే నేడే ప్రారంభించండి. ***"ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూల సమయం, ఇదిగో ఇదే రక్షణ దినము"*** 2కొరింథి.6:2. బైబిలు పూర్తిగా చదవటాన్ని ఒక సవాలుగా తీసుకొని చదవటం ప్రారంభించండి. వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రారంభించండి. ఒకసారి త్వరగా పూర్తిచేసిన తర్వాత మరలా నిదానంగా అర్థం చేసుకుంటూ చదవండి. బైబిలును ఆదికాండం నుండి ప్రారంభించి ప్రకటన గ్రంథము వరకు క్రమంగా చదవండి. అంతేకాని ఉదయం పాత నిబంధనలో సాయంత్రం క్రొత్తనిబంధనలో చదవకూడదు. బైబిలు త్వరగా పూర్తి చేయుటకు దేవుడు మీకు సహాయము దయచేయును గాక! ఆమెన్!!

# కృపాదానం

1950-55 వరకు నూజివీడు తాలూకా పల్లెటూర్లకు బస్ సౌకర్యం లేదు. ఎటు వెళ్ళిన 4 లేక 5 మైళ్ళు అంటే సుమారు 6-8 కి.మీ. నడవాలి. నూటికి 50 గ్రామాలకు కరెంటు లేదు. కనుక రాత్రి ప్రయాణం చీకటిలోనే. పల్లెలకు మంచి నీటి వసతి అసలే లేదు. మైళ్ళు నడచి వెళ్ళి బిందెతో నీళ్ళు త్రాగటానికి తెచ్చుకోవాలి.

ఆ రోజుల్లో అన్ని జిల్లాలలోను కృపాదానం కుటుంబం పెద్దది, అంటే 8 మంది సంతానము. అప్పటికి పిల్లల చదువులోనికి వ్యాపారం ప్రవేశించలేదు. ఒక్కో విద్యార్థికి 4 పుస్తకాలు నాలుగు పీరియడ్స్‌కి ఒక పూట కలిగి ఉంటే గొప్పే. స్కూల్లో ఉద్యోగాలు లేకపోయినా మెట్రోపాలిటన్ మిషన్‌వారు ప్రతి పాస్టరమ్మకు కూడా టీచరు ఉద్యోగాలు కల్పించేవారు. పాస్టర్‌గారి కుటుంబ ఆదాయం పెంచుటకు ఉద్యోగం ముఖ్యమైనది. కొద్ది నెలల తర్వాత ప్రతి పాస్టరుకి ఒక కుట్టు మిషన్ ఇచ్చారు. నాటి మెట్రోపాలిటన్ మిషన్ కార్యాలయము విజయవాడ గుణదలలో ఉండేది.

కృపాదానం మిలటరీ రిటర్న్ అయినందు వలనను, చదువులో కూడా మిగిలిన వారికంటే ఒక క్లాసు ఎక్కువ చదివినందువలన నాటి మిషనరీలకు అర్థం అయ్యే ఇంగ్లీషు మాట్లాడటం వలన ఒక సంవత్సరములో ఒక గ్రామములో పాదిరిగా చేసిన అనంతరం సంఘము కొంచెము మెరుగు పడిన తర్వాత ఆయనను మరొక గ్రామానికి కుటుంబంతో సహా బదిలీ చేసేవారు. అందువలన పిల్లలకు చదువు సరిగా అందలేదు. హాస్టల్‌లో పెట్టి చదివించే అలవాటు లేదు.

మర్సపూడి గ్రామము నుండి చదువుకోవటానికి 2 మైళ్ళు నడవాలి. మర్సపూడి నుండి ఈదర గ్రామాలకి ఆయనను బదిలీ చేసిన తర్వాత హైస్కూలులో 8వ తరగతి చదవాలన్న ప్రతిరోజు 9 కి.మీ. నడవాల్సి వచ్చింది. కనుక ఒంగోలులోనే తనకు కలిగివున్న స్వంత ఇంటిలోనే పెద్దపిల్లలను (పది సంవత్సరముల వయస్సు దాటిన నలుగురిని) తన పెద్ద కుమార్తె కాపురంలో ఉంచి ఒక్క సంవత్సరం చదివించి, తర్వాత ఎ.బి.యం. హాస్టల్స్‌లో చేర్చి చదివించాడు.

ప్రతి హాస్టల్‌లోను అన్ని రకముల పిల్లలు రకరకాల గ్రామాల నుండి వచ్చి చదివేవారు. పిల్లలు చెడ్డ అలవాట్లను (స్పర్శ ద్వారా వ్యాపించే రోగమువలె) త్వరగా నేర్చుకున్నారు. పిల్లలను దేవుడు తల్లిదండ్రులకు ఇచ్చేది వారికి ఆహారము పెట్టి పోషించటానికి కాదు గాని, లోకంలో సాతానుని సహవాసంలో పడిపోకుండా కాపు కాయటానికి మాత్రమే! తల్లిదండ్రుల పోషణలోను, పరిపాలనలోను పెరిగిన పిల్లలే దేవునిలో జీవించగలరు అని, ఒక్కసారి పాడైన పిల్లలను సరైన దారిలోనికి మళ్ళించటానికి తల్లిదండ్రులకు చాలా కష్టతరమైన, అసాధ్యమైన పని అని తరువాత తెలుసు కున్నాడు.

కృపాదానం 23 సంవత్సరాల వయస్సులో తన అన్న ఆశీర్వాదముతో కలిసి తెలంగాణ పెద్దపల్లి ప్రాంతములో దేవుని సేవ చేసినారు. వివాహమైన తర్వాత రెండవ కుమార్తె మార్త జన్మించే సమయానికి భువనగిరిలో సేవచేస్తున్నాడు. తర్వాత మిలటరీలో 6 సం॥లు బొంబాయిలో ఉన్నాడు. మిలటరీ నుండి వచ్చిన తర్వాత ఈస్టు గోదావరి, సామర్లకోట, తుని కాకినాడ ప్రాంతములో సేవ చేస్తూ 1950 నుండి నూజివీడు ప్రాంతములో సేవ చేస్తున్నాడు. కృపాదానంగారు కృష్ణజిల్లా నూజివీడు చుట్టు ప్రక్కల గ్రామాలలో పాదిరిగా మెట్రోపాలిటన్ మిషన్‌లో పనిచేస్తున్నప్పుడు ఆయనకు పది మంది పిల్లలు ఆయన పాదిరిగాను, భార్య హన్నమ్మగారికి టీచరుగాను జీతములు తీసుకొంటు న్నారు మిషన్ వారు ఇచ్చిన ఇల్లు. ఆర్థికంగా కాస్త నిలదొక్కుకుంటున్న సమయంలో బైబిల్ ట్రైనింగ్ చేయవలెనన్న ఆశ కలిగింది.

రామాయపట్నం సెమినరీలో ఇంగ్లీషు కోర్సు జి.టి.హెచ్. ప్రారంభమైనదని తెలిసి కుటుంబములోని

పెద్దకుమార్తె, భార్యతో కలిసి ముగ్గురు సెమినరీ చదవాలని నిర్ణయించుకున్నారు. దానికి మెట్రోపాలిటన్ మిషన్ దొరలు ఒప్పుకోక అక్కడ మీకిచ్చే స్టైఫండుతో ఎలా బ్రతుకుతారు? అని అడ్డం చెప్పారు. ఇది దేవుని పిలుపు అని నమ్ముతున్నాం. నేను, నాభార్య, ప్రార్థన చేసుకొని నిర్ణయం తీసుకున్నామని కృపాదానంగారు చెప్పినా వారు ఒప్పు కోలేదు. అయినా సరే ఆత్మ ప్రేరేపణ మేరకు 1953లో కుటుంబముతో సహా రామాయపట్నం వచ్చి బాప్టిస్టు థియోలాజికల్ సెమినరీలో చేరారు. అంత పెద్ద కుటుంబానికి సరిపోయే గృహాలు అక్కడ లేనందున ఎలిమెంటరీ స్కూలును వేరే చోటికి మార్చి, ఆ స్కూలు బిల్డింగ్ మొత్తం కృపాదానం కుటుంబం ఉండటానికి ఇచ్చారు.

1957లో సెమినరీ నుండి స్వగ్రామమైన ఒంగోలుకు కుటుంబంతో వచ్చి స్వంత ఇంటిలో నివాసము ఉన్నప్పుడు మిషన్‌లో పాస్టరు పని దొరకలేదు. అందువలన మద్రాసు లోని ఓ పెద్ద కంపెనీలో ఉద్యోగములో చేరి వారిచ్చిన కారులో ఆంధ్రప్రదేశ్ అంతా తిరిగి వ్యాపారం చేసేవాడు.

అయితే దేవుని సేవ చేయవలసినవారము. ఈ వ్యాపారం ఏమిటి? అన్న వ్యధ కృపాదానం దంపతులను బాధించేది. అప్పటికి వారికి 12మంది సంతానం. మిషన్ వారు సేవకుని ఉద్యోగం ఇచ్చేదేమిటి? దేవుడు మనలను సేవకు పిలుస్తున్నాడు. కనుక హృదయంలో ఈ భారము ఎక్కువకాలం మొయ్యలేము. దేవుని పనిచేస్తే ఆయన అన్నం పెట్టడా? అనే సందిగ్ధంలో ఉంటూ ఒక సంవత్సరమంతా ప్రార్థించారు. చివరికి "కృపాదానం నా సేవ చెయ్యి" అను దేవుని పిలుపును స్పష్టంగా విన్నారు.

ఇంతకు ముందు ప్రార్థించి పాదిరి పని మాని సెమినరికి వచ్చారు అక్కడే అదే ప్రార్థన విశ్వాసములతో వ్యాపారం వదలి వట్టి బైబిల్ పట్టుకొని ఇంతకముందు సువార్త ప్రకటించబడని గ్రామాలు పట్టణాలు తిరిగారు. మూడు సంవత్సరాలు ప్రభువు యొక్క కఠిన పరీక్షలను భరించారు. పిల్లలకు సరైన ఆహారం, వస్త్రములు లేక పోయినా అదే విశ్వాసముతో సేవ కొనసాగించారు. తన కుటుంబ ఆర్థిక పరిస్థితినిబట్టి ప్రజలు చేసే ఎగతాళుల మధ్య ఎంతో సహనంతో జీవించారు.

మద్రాసు కంపెని వారి వ్యాపారం మాని వేసినప్పుడు సేవకు అన్నంగి గ్రామం వెళితే, అక్కడ ఒక పాస్టరు "మీకు జీతము ఎవరిస్తారు ఇప్పుడు" అన్నాడు. ఇంతకముందు నేను పని చేసిన కంపెని మద్రాసులో మాత్రమే ఉండేది. ఇప్పుడు ప్రభువు నన్ను నడిపించిన చోటుకెల్ల ఆయన కార్యాలయములు ఉన్నాయి. మద్రాసు కంపెనీ వారికంటే నా యజమాని ఊహించలేనంత ధనవంతుడు అని సమాధానం ఇచ్చారు కృపాదానం. తర్వాత ప్రభువు 1967 నుండి ప్రతిరోజు 400 మంది అనాధులకు ఆహారం పెట్టే పని ఇచ్చాడు. ఆంధ్రలో వందకు పైగా ప్రార్థనా మందిరాలు నిర్మింపజేశారు కృపాదానం. **( సశేషం)**


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, తెలుగు క్రైస్తవ సినిమాలు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు, క్రైస్తవ వివాహ వేదిక, మీ ప్రార్థన అవసరతల కొరకు ప్రార్థనా గది... ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlineteluguble.net**

# దేవున్ని వెదకండి

మనిషి ఎలా ఉండాలని ఆశించి మనిషిని తన కోసం, తన పోలిక చొప్పున చేసుకున్నాడో అందుకు పూర్తి విరుద్ధంగా మనిషి జీవించాడు. దేవుడు ఈ భూమి మీద మనుష్యులను చేసినందుకు పశ్చాత్తాపపడి, బాధపడేలా మనుష్యులు దేవునికి వ్యతిరేకంగా జీవించారు. *'దేవుడు భూలోకమును చూచినప్పుడు అది చెడిపోయి యుండెను; భూమి మీద సమస్త శరీరులు తమ మార్గమును చెరిపి వేసుకొనియుండిరి' (ఆదికాండము 6:12).* బిడ్డలు చెడిపోయి తమ ఇష్టానుసారమైన జీవితం జీవిస్తుంటే వారిని ప్రేమించే తల్లిదండ్రులకు ఎలా ఉంటుంది? బిడ్డలను చూచినప్పుడల్లా ఒక నరకంలా ఉంటుంది. తన స్వహస్తాలతో తన కోసం సృజించుకున్న మనుష్యులు ఈ భూమి మీద చెడిపోయి తమ మార్గం చెరిపివేసుకొని తమ ఇష్టానుసారంగా జీవిస్తుంటే దేవుడు కూడా చాలా బాధపడ్డాడు. అందుకే భూమి మీద మనుష్యులను చేసినందుకు దేవుడు తన హృదయంలో నొచ్చుకొని వారిని అంతం చేయాలనుకున్నాడు. అప్పుడు నోవహు ఒక్కడే నీతిమంతుడుగా కనిపించాడు. ఎందుకంటే నోవహు దేవున్ని వెదుకుతూ ఆయన మార్గంలో ఉన్నాడు. ఈ భూమి మీద నోవహు తప్ప దేవున్ని వెదికే వారు ఒక్కరూ కనిపించలేదు. ఈ లోకంలో అనేకమంది దేవునికి దూరమై నానా బాధలతో దిక్కు తెలియని స్థితిలో ఉన్నారు. చాలామంది ధనవంతులు కూడా వారి ధనము వలన సంతృప్తి చెందని స్థితిలో ఉన్నారు. వారికి అన్నీ ఉంటాయి, కానీ ఏదో వెలితి కనిపిస్తుంది. దేవుడు లేని జీవితాలు ఎప్పటికీ వెలితిగానే ఉంటాయి. చాలామందికి దేవుడున్నాడా? అన్న అనుమానం వస్తుంటుంది. కొంతమంది దేవుడెవరు? అని ఆలోచిస్తుంటారు. వారిలో ఇంకొంతమంది దేవుడిని వెదకటం ప్రారంభిస్తారు. ఎవరైతే హృదయపూర్వకంగా దేవుడిని వెదకుతారో 'నేనే దేవుడను' అని దేవుడు తన్ను తాను వారికి ప్రత్యక్ష పరచుకుంటాడు. అనేకమంది దేవుని పిల్లలు అని చెప్పుకొనే వాళ్ళు కూడా ఈ లోకానుసారమైన జీవితం జీవిస్తూ దేవునికి దూరంగానే ఉంటారు. వారే తప్పిపోయిన కుమారుని పోలిన వారు. అతను తనకు కష్టం వచ్చినప్పుడు తన తండ్రిని వెదకుతూ ఎలా వచ్చాడో అలానే ప్రతి ఒక్కరూ దేవున్ని వెదకాలి. కుమారుని కోసం ఆ తండ్రి ఎలా ఎదురు చూస్తు న్నాడో, దేవుడు కూడా ప్రతి ఒక్కరికోసం నిరంతరం ఎదురు చూస్తూ మనం ఆయన దగ్గరకు రావాలని నిరీక్షిస్తూ ఉంటాడు. *'తమ ఆలోచనల ననుసరించి చెడుమార్గమున నడచుకొనుచు లోబడనొల్లని ప్రజలవైపు దినమంతయు నా చేతులు చాపుచున్నాను' (యెషయా 65:2)* అని మన వైపే చూస్తూ, మన కోసం నిరీక్షిస్తున్న ఆయన నిరీక్షణకు అందనంత దూరం వెళ్తే మనం భ్రష్టమనస్సుకు అప్పగెప్పబడతాము. అప్పుడు దేవుడు ఇంక మనకు దొరకడు. అందుకే ఆయన సమీపంగా ఉండగానే ఆయన దగ్గరకు వచ్చి మన జీవితాలను బాగు చేయమని వేడుకోవాలి. మరి నీవు ఈ లోకానుసారమైన జీవితం జీవిస్తూ దేవునికి ఎంత దూరంలో ఉన్నావో బేరీజు వేసుకొని, నీ జీవితాన్ని మార్చుకోడానికి నీ కోసం చేతులు చాచి నిరీక్షిస్తున్న దేవుని దగ్గరకు రావడానికి నీవు సిద్ధమా?.

**'హన్నాకృప'** పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. "మీ పత్రిక ఫలానా చోట చూశాము. మా అధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలు కరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము" అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నడుపగలుగుతున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టటం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్యమవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 350/- రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయంతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను. **– ఎడిటర్**

13

# దేవుడు - సిరి

మానవ జీవితం జన్మించిన నాటినుండి మరణించేంత వరకు విశ్వాసములో పడిపోవడం, లేచి నిలుచోవడంతోనే సరిపోతుంది. దోగాడే బిడ్డ లేచి నడవాలని ప్రయత్నించి పడిపోయి లేచి ఇతరుల సహాయంకాని బల్ల, మంచం పట్టుకొని నడక మొదలుపెట్టి చివరికి ధైర్యంతో విశ్వాసంతో నడవటం తర్వాత పరుగెత్తడం చేస్తుంది.

అదేవిధంగా మన జీవితం సాఫీగా నడవటానికి మన విశ్వాసమే కారణం అవుతుంది. బస్ డ్రైవర్ మీద విశ్వాసం లేనివారు బస్‌లో సందేహిస్తూ కీడు శంకిస్తూ సంతోషంగా ప్రయాణం సాగించలేరు. మన దేవునిమీద మనం పెంచుకొని స్థిరపరచుకొనిన జీవితమే మనకు నెమ్మది ప్రసాదిస్తుంది.

దేవుని నమ్మవా? అని ఎవరినైనా అడిగితే నిజంగా నాకు దేవుడంటే భలే నమ్మకం అని అంటారు. మరి ఆయన చెప్పినట్లుగా చేసి ఎందుకు సంతోషంగా సమృద్ధిలో జీవించవు అని అడిగితే వాళ్ళకి కోపం వస్తుంది. నీవు సంతోషంగా, సమృద్ధిలో ఉన్నావా? అని అడుగుతారు.

అవును, నేను సమృద్ధిలో ఉన్నాను. నాకు వచ్చే రాబడి, ఆదాయం అంతా మనుష్యుల ద్వారానే జరుగు తుంది. అయితే నాకు ఇచ్చేవాళ్ళు యేసుప్రభువు చెబితేనే ఇస్తారు. ఎంత ఇస్తారు అంటే నేను ఆశ్చర్యపోయేటంత ఇస్తారు. నేనెక్కడికి వెళ్ళినా, ప్రసంగం చేసినా, నేను సర్వసమృద్ధిలో ఉన్నానని, నా గిన్నె నిండి పొర్లుచున్నదని చెబుతాను. ఇది యథార్థం కూడా! అయితే ఈ సంగతి వినిన వాళ్ళు ఈయన సర్వ సమృద్ధిలో ఉన్నాడు కనుక ఈయనకు చందా ఇవ్వనవసరము లేదు, లేకుంటే ఇంత చందా ఇవ్వనవసరము లేదు, కొద్దిగా ఇస్తే చాలు అని అనుకుంటారన్న ఆలోచన లేదు. ఎందుకంటే మనుష్యుల ద్వారా నాకు ఇప్పించబడుతున్నప్పటికి దేవుడు వారిని ఇవ్వమని ప్రేరేపిస్తే ఇవ్వకుండా ఎలా ఉండగలరు?

వాక్యబోధకుడైనా.. వాక్యము వినేవారైనా... ఎవరైనా సరే ఆశీర్వదింపబడాలంటే వారి హృదయం విశాల పరచ బడాలి. ధాతృత్వం వారి మంచి గుణాలలో మొదటిదై ఉండాలి. అంటే ఇతరులకు ఇచ్చే ప్రేరేపణ దేవుడు మన హృదయాలలో కలిగించగానే ఆలోచించకుండా దేవుని యందలి విశ్వాసముతో, మన లేమిలో మనకు కలిగిన జీవనమంతయు ఇవ్వవలసియున్నది.

ఇది అసాధ్యము కాదు. విజయవంతమైన ప్రయోగం. ఎవరైనా దేవుని మీద విశ్వాసంతో ప్రయోగం చేస్తే తప్పక జయకరమైన జీవితంలో ప్రవేశిస్తారు. టెన్షన్ ఉండదు. రోగశయ్య ఉండదు.

*"బీదలను కటాక్షించువాడు ధన్యుడు ఆపత్కాలమందు యెహోవా వానిని తప్పించును. యెహోవా వానిని కాపాడి బ్రతికించును, భూమిమీదవాడు ధన్యుడగును. వాని శత్రువుల ఇచ్ఛకు నీవు వానిని అప్పగింపవు. రోగశయ్య మీద యెహోవా వానిని ఆదరించును. రోగము కలుగగా నీవే వానిని స్వస్థపరచుదువు"* కీర్తనలు 41:1-3

ఇది కదా విశ్వాసమంటే? డాక్టరు చెయ్యి ఎటుపోతే అటు మందులు రాసి పడేస్తే మనం అనుమానించకుండా ఆలోచించకుండా కొనుక్కుంటాం. అయితే యెహోవా చెప్పిన విధముగా బీదలను కనికరిస్తే మందులు మ్రింగకుండా స్వస్థత. అయితే దేవునియందలి విశ్వాసము ఉన్నదా? చిన్నపిల్ల నడక ప్రాక్టీసు చేసినట్లుగా మనం చేసే దాన ధర్మాలు ప్రతినెల మన శక్తికి మించిన వాటివలె మనకు కనిపించినప్పుడు అలా బీదలను కటాక్షించడం అలవాటు చేసుకొంటే ధనవంతుల కంటే మనం ఎంత ఎక్కువ ఇతరులకు ఇస్తామో అంత ధనవంతులమవుతాము.

ఇతరులకు ఇచ్చేవారిని గమనించండి. వారి వయస్సుతో సంబంధము లేకుండా వారు ప్రశాంతంగా ఉంటారు. ఆ ప్రశాంతతకు ఎవరు విలువకట్టగలరు?

**12**

# లోకంతీరు

**(పుట్టుక చావు మధ్య సంబరం)**

దేవునికి విధేయులుగా ఉండే వారు వారి పూర్తి ఆయుష్కాలమును అనుభవిస్తారు. "యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట దీర్ఘాయువునకు కారణం భక్తిహీనుల ఆయుష్షు తక్కువై పోవును" అని సామెతలు 10:27లో ఉంది. అంటే భక్తిహీనులు త్వరగా చనిపోతారు, దేవునికి లోబడి వుండేవారు ఎక్కువకాలం బ్రతుకుతారు. "మరణము తప్పించుట ప్రభువైన యెహోవా వశము" అని కీర్తనలు 68:20లో వ్రాయబడిన ప్రకారం మనుష్యులు అర్ధాంతరంగా చావకుండా దేవుడు మరణం నుండి తప్పిస్తాడు. దేవునియందు భయభక్తులు కలిగి వుంటడం దీర్ఘాయువును ఇస్తుందని తెలియక ఎంతో మంది తమ ఆయుష్షును పెంచుకోడానికి ఎంతో డబ్బు ఖర్చు చేసి రకరకాల మార్గాలు ఎంచుకుంటారు. ఏ రోగం లేకపోయినా తరచుగా హాస్పటల్స్‌కి వెళ్ళి ఆరోగ్యం ఎలా ఉందో పరీక్షించుకుంటుంటారు. ఇక ఏదైనా బి.పి., షుగరు, గుండె, కాలేయ సమస్యలు ఉన్న వాళ్ళ సంగతి చెప్పనక్కర్లేదు. ప్రతి రోజూ ముందులు మింగాల్సిందే. చచ్చేదాక మందులతోనే ప్రాణాలు నిలబెట్టుకోవాల్సిన పరిస్థితిలోకి వెళ్ళిపోతారు. మందులు మింగకపోతే చస్తారు. దేవుడు మనుష్యులకు అనుగ్రహించిన ఆయుష్షును పూర్తిగా అనుభవించకుండానే మనుష్యులు అర్ధాంతరంగా చనిపోవ డానికి కారణం వారి క్రియల ఫలితమే అని చెప్పవచ్చును. సామెతలు 11:4లో "నీతి మరణము నుండి రక్షించును" అని వ్రాయబడి ఉంది. అలాగే 11:19లో "దుష్టక్రియలు విడువక చేయువాడు తన మరణమునకే చేయును" అని వుంది. కాబట్టి దేవుడు తన కొరకు ఏర్పరచుకొని, తన కొరకు జీవించాలని భూమి మీద జన్మింప చేసిన మనిషి, దేవుడు తనకిచ్చిన స్వేచ్ఛని దుర్వినియోగం చేస్తూ, ఈ భూమి మీద వారి కొరకు వివిధ తంత్రములు కల్పించుకొని (ప్రసంగి 7:29) దేవుడు వారికి అనుగ్రహించిన ఆయుష్షును తగ్గించుకొని దేవునికి దూరమవుతూ మరణానికి దగ్గరవుతున్నారు.

ఈ సృష్టి ఆరంభం మొదలుకొని ఈ భూమి మీద జన్మించిన వారిలో మొదటగా చనిపోయిన హేబెలు నుండి ఈ రోజు వరకు కోటానుకోట్ల మంది మరణించారు. మరణించిన వారిలో మహామహులు ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించినవారు, అత్యంత ధనవంతులు కూడా మరణించారు. ప్రసంగి 9:5లో వ్రాయబడిన ప్రకారం "బ్రదికియుండు వారు తాము చత్తురని ఎరుగుదురు. అయితే చచ్చిన వారు ఏమియు ఎరుగరు. వారి పేరు మరువబడి యున్నది" భూమి మీద మరణించిన వారి పేరు మరువబడుతుందని చెప్పబడింది. కాబట్టి బ్రతికియుండగా మనుష్యులు తమ ఘనత కోసం, పేరు ప్రఖ్యాతుల కోసం పడే పాట్లు అన్నీ వ్యర్థములు అని తాము బ్రతికి యున్నంత కాలంలో ఒక్కసారి కూడా అనుకోక పోవడానికి కారణం, వారు తాము చనిపోతామనే విషయాన్ని గుర్తుంచుకోకపోవడమే.

ఎవరైనా ఒక వ్యక్తి కొద్దికాలంలో చనిపోతాడని తెలిస్తే అతని మానసికస్థితి ఎలా ఉంటుంది? అతను సంతోషంగా ఉండగలడా? భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకుంటూ ఆస్తులు కూడబెట్టుకోడానికి ఆసక్తి కనబరుస్తాడా? స్నేహితులతో కలిసి సరదాగా సంతోషంగా గడపటానికి ఇష్టపడతారా? ఉద్యోగం చేయాలనో, వ్యాపారం చేయాలనో కోరుకుంటారా? మంచి మంచి బట్టలు కొనుక్కోవాలని, సూటు బూటు వేసుకొని తిరగాలని కోరుకుంటారా? ఏమి కోరుకోరు. తాను చనిపోతాను కదా అని మానసికంగా కృంగిపోతారు. అలాంటప్పుడు ఈ లోకంలో అన్నీ సంపాదించుకొనేవారు చనిపోము అనే కదా సంపాదించుకుంటున్నారు. కొద్ది రోజుల్లో చనిపోయే వ్యక్తి యొక్క మానసిక స్థితికి ఎప్పుడో చనిపోతాము అన్న వ్యక్తి యొక్క మానసిక స్థితికి ఎంతో తేడా కనిపిస్తుంది కదా!

**పుట్టుక**

**దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక -10

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 అ | 2 గ | మ్య | 3 ము | లు | ■ | 4 అ | ■ | 5 క |
| ■ | లి | ■ | మ | ■ | 6 అ | అ | అ | చ్చ |
| 7 మా | ల | బ | నా | ■ | ■ | అ | ■ | డ |
| ■ | య | ■ | 8 నా | 9 శ | న | పు | ర | ము |
| 10 ప | ■ | 11 ము | ■ | కు | ■ | అ | ■ | లు |
| 12 ర | క్ష | ణ | ది | న | 13 ము | ■ | 14 ప | ■ |
| లో | ■ | ర్ప | ■ | ■ | 15 ణ | ర | ద | ఆ |
| 16 క | క | నా | ను | ■ | ర | ■ | హో | ■ |
| ము | ■ | పా | ■ | 17 సం | చ | క | రు | వు |

**అడ్డం :**

1. ఆయన (దేవుని) మార్గములెంతో ----- (రోమా) (5)
6. ఇశ్రాయేలీసుల పేర్లు వ్రాయవలసిన రత్నాలు (4) (నిర్గమ)
7. యెహోవా --- యథార్థమైనది నీ మార్గం (4) (తిరగబడింది)
8. కనాను భాషతో మాట్లాడు ఐదు ఐగుప్తు పట్టణాలలో ఒకటి(6) (యెషయా)
12. ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయం. ఇదిగో ఇదే ---- (6) (2కొరింథీ)
15. ధనవంతులారా మీరు కోరిన ---- మీరు పొందియున్నారు (4) (తిరగబడింది) (లూకా)
16. హోము ఎవరికి తండ్రి (1 3) (ఆది) మీకు నత్తి ఉందా?
17. ఆయన తన ఆత్మ అను ----ను మనకు అనుగ్రహించియున్నాడు (5) (కొరింథీ)

**నిలువు :**

2. సీమోను అంద్రెయలు చేపలు పట్టుచున్న సముద్రం (4) (మార్కు)
3. భూలోకమందంతట ----- ప్రచురము చేయునట్లును ఇందుకే నేను నిన్ను నియమించితిని (4) (నిర్గమ) (తిరగబడింది)
4. పరిశుద్ధ పట్టణ ప్రాకారపు మొదటి పునాది రాయి (5) (ప్రకటన) (తారుమారు)
5. ఆదాము హవ్వలు అంజూరపు ఆకులతో తయారుచేసుకున్నవి (5) (ఆది)
9. ఏమి చెప్పు దానిని బ్రదకనియ్యకూడదు (3) (నిర్గమ) ( తోక తెగింది)
10. ఇప్పుడు నాకు సాక్షియైనవాడు -----లో నున్నాడు (5) (యోబు)
11. పడి ద్రాక్షరసమును ------ గా తేవలెను (5) (సంఖ్యా) (తిరగబడింది)
13. "నీ ------ (4) లే నమ్మితి నమ్మితి" (తిరగబడిన పురుషోత్తమచౌదరిగారి పాట)
14. ఉజ్జియా రాజైనప్పుడు అతని వయస్సు (4) (2దినవృ)

మీ జవాబులు గడులలో పూర్తిచేసి, ఫోటో తీసి, మీ మీ పేరు, ఊరు, బుక్ సీరియల్ నంబరు వ్రాసి, 9440217726 నంబరుకు **వాట్సాప్** ద్వారా పంపవచ్చును.